బ్రెయిన్ దొంగతనం!

ఏ. వీ. మోహన్రావ్

గాలిలో ఎగురుతూంది విమానం.

భూమికి ఆరు వేలడుగుల ఎత్తున, మబ్బుల్ని రాసుకుంటూ నక్షత్రాల్ని గీచుకుంటూ, నల్లటి చీకటిని చీల్చుకుంటూ పోతూంది.

సైన్స్ జర్నల్ తిరగేస్తూ కూర్చున్నాడు ప్రొఫెసర్ శాస్త్రి. ప్రపంచంలో ఆటమిక్ సైన్స్ గురించి పూర్ణంగా తెలిసిన శాస్త్రవేత్తలలో అతను ప్రథముడు. హేగ్ నగరంలో జరిగిన కాన్ఫరెన్సులో భారతదేశం తరఫున పాల్గొని తిరిగి ఇండియాకు వస్తున్నాడు. విమానంలో దాదాపు సగం సీట్లు ఖాళీగానే వున్నాయి.

వరుసగా నాలుగైదు విమానాల్ని అంతకుముందు

వారంలో హైజాక్ చేశారు అరబ్ కమాండోలు. ప్రయాణీకుల్ని చిత్రహింసలు పెట్టారు. కొంతమందిని దారుణంగా కాల్చి చంపారు. ఆ అకారణ దారుణ మారణహోమం ప్రపంచ వ్యాప్తంగా పొందిన ప్రచారం దెబ్బకు, విమాన సర్వీసులు విపరీతంగా నష్టపోయాయి.

"నేనిక్కడ కూర్చోవచ్చా శాస్త్రీ!" అడిగింది శాస్త్రిగారి ముందు అందమైన అమ్మాయి. ఆయన తలెత్తి చూశాడు. మెరుపుతీగలావుంది. యవ్వనంతో బంగారులా వెలిగిపోతోంది వొళ్ళు. చక్రాల్లాంటి కళ్ళు నెమలిరంగులో వున్నాయి. పొడవుపాటి ముక్కు చిన్న నోటిపైకి తొంగి చూస్తున్నట్లు వొంపు తిరిగివుంది. వంగివుండడంతో గౌను లోపలినుంచి కనుపించాయి అందమైన, బరువుగావున్న లావుపాటి రొమ్ములు.

"నైనాట్!" అన్నాడు ఉత్సాహంగా శాస్త్రి. ఆయనకు నలభై సంవత్సరాలుంటాయి. మనిషి అందంగానే వుంటాడు. తల ముప్పాతిక భాగం తెల్లబడింది.

"మా ఫాదర్ ఇండియనే! నేను హేగ్‌లో సెటిలై పోయాను. మీరు!" అంది చలాకీగా రొమ్ములు కదలిస్తూ.

"ఇండియన్నే. కాన్ఫరెన్సు అటెండయి పోతున్నాను" అన్నాడు శాస్త్రి.

"పేపరులో చదివాను, ఇక్కడేదో ఆటమిక్ సైన్సు గురించి ప్రపంచ సభలు జరుగుతున్నట్లు" అంది ఆమె.

"అవును. వాటికోసమే వచ్చాను" అన్నాడు శాస్త్రి

"ఇండియా చాలా ఇంప్రూవ్ అయిందని విన్నాను. నిజమేనా?"

"నిజమే! నువ్వు వస్తున్నావుగా. స్వయంగా చూసి అభిప్రాయం ఏర్పరచుకో."

ఎయిర్ హోస్టెస్ వచ్చి బిస్కెట్స్, కాఫీ అందించింది. ఇద్దరూ మాట్లాడుకుంటూ వాటిని సేవించారు.

ప్రొఫెసర్ శాస్త్రికి పెళ్ళికాలేదు. అతని తల్లిదండ్రులు చాలాసార్లు చెప్పి చూశారు. కానీ అతను వినలేదు. అతని వృత్తిరీత్యా ఆడవాళ్ళను కలుసుకునే అవకాశంగానీ, వాళ్ళతో పరిచయం పెంచుకొనే వీలుగానీ లేవు. డిఫెన్సు డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నడుస్తున్న రిసెర్చి లాబ్కు డైరెక్టరుగా పనిచేస్తున్నాడు శాస్త్రి. అణుశాస్త్రాన్ని మిలిటరీ ప్రయోజనాలకోసం ఎలా ఉపయోగించడమన్నదే ఆయన నిత్యం జరిపే పరిశోధన.

"నా పేరు సుసనా" అందామె.

"ఇండియన్ అంటున్నావుగా. హాయిగా సుశీలని పెట్టుకోలేకపోయావా?"

"మీరు నన్ను అలాగే పిలవండి. ఎటూ ఇండియాలో రెండు మాసాలు వుండేందుకు వస్తున్నాను. ఎవరన్నా అడిగితే మీరు చెప్పిన పేరే చెప్తాను. మీ పేరు చెప్పారు కాదు!" అంది సుసనా.

"శాస్త్రి!" అన్నాడు నవ్వుతూ.

ఆమె అలా ఏవేవో, నోటికొచ్చిందల్లా మాట్లాడుతూనేవుంది. తనకు తెలిసిన విషయాలు, హేగ్లో జీవితం ఎలావుంటుందో ఏమిటో వివరంగా చెప్పింది. శాస్త్రికి అంత ఇంటరెస్టు లేకున్నా విన్నాడు. అలా వింటూ దృష్టంతా, ఆమె అందంపైన నిలిపి, కళ్ళతోనే జుర్రుకుని తాగసాగాడు.

సుసనాక్కూడా, శాస్త్రి చూపులు, మాటి మాటికీ సీటులో అటూ ఇటూ కదులుతున్న ఉద్రేకపు సూచనలు, అర్థమయినాయి. అయినా గమనించనట్టు తన అంగాంగ

ప్రదర్శన మోతాదు మరికొంత పెంచి మాట్లాడసాగింది.

ఎయిర్ హోస్టెస్ వచ్చి అందర్నీ బెల్ట్ కట్టుకోమని హెచ్చరించి వెళ్ళింది. అంటే ప్లేన్ లాండింగ్ కాబోతుందన్నమాట. ఏవిధమైన ఇబ్బందికీ గురికాకుండా విమానం ఇండియా చేరినందుకు ప్రయాణీకులు ఆనందంగా వున్నారు.

"మనం దిగేది బొంబాయికదూ!" అడిగింది సుశీల.

"అవును! నువ్వెక్కడకెళ్ళాలి?"

"మద్రాసు! అక్కడ నా ఫ్రెండ్స్ అదే పెన్ ఫ్రెండ్స్ వున్నారు. మీరిక్కడే వుంటారా?" అడిగింది.

"ఢిల్లీలో వుంటాను. అక్కడ చూడవలసినవి చాలా వున్నాయి. తిరిగి మీ దేశం వెళ్ళేలోగా అక్కడికి వచ్చి పోరాదూ!" అడిగాడు శాస్త్రి.

"వస్తాను. కానీ మీరు ఆతిథ్యం ఇస్తామని మాటిస్తే" అంది గోముగా.

"షూర్! ఇది నా అడ్రస్. వచ్చేముందు వైర్ చెయ్యి" అంటూ తన అడ్రసు ప్రింటుచేసివున్న కార్డు ఇచ్చాడు.

విమానం శాంతాక్రజ్‌లో ఆగింది. అందరూ దిగి వెలుపలికొచ్చారు. అరగంటలోగానే బయలుదేరిన ఇండియన్ ఎయిర్ లైన్స్ ప్లేన్‌లో సుశీల మద్రాసు వెళ్ళిపోయింది. శాస్త్రి టాక్సీ ఎక్కి గెస్ట్ హౌస్‌కు వెళ్ళిపోయాడు. కాస్త రెస్ట్ తీసుకొని, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ వెళ్ళాలని ముందుగానే నిర్ణయించుకొని వున్నాడు.

సుసనా శాస్త్రిని తలచుకొని నవ్వుకుంది. అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు గడించిన మనిషి, కేవలం ఒక ఆడదాన్ని, యవ్వనాన్ని చూడగానే మత్తుమందువున్నట్లు మైకం కమ్మినట్లు, ప్రవర్తించడం వింతగా తోచింది. తను ఇండియా చూచేందుకు రాలేదనీ, ప్రొఫెసర్ శాస్త్రి

పన్నెండు సంవత్సరాలు కృషిచేసి కనిపెట్టిన "ఆటమిక్ డిఫెన్స్ రేస్"కు సంబంధించిన ఫార్ములాలను సంస్కరించుకు పోయేందుకని చెప్పివుంటే, ఏంచేసి వుండేవాడాని ఊహించసాగింది.

ప్రొఫెసర్ శాస్త్రి గురించి కూలంకషంగా సేకరించిన వివరాలుగల ఫైలు తన దగ్గర వుంది. దాన్ని వెంట తెచ్చింది. అందులో పుట్టింది మొదలు అతను చేసిన పనులు, సాధించిన ఘనకార్యాలు పొందుపరచబడివున్నాయి. అతను పని చేస్తున్నది మిలటరీ వాళ్ళకు సంబంధించిన లాబ్ కావడం, అందులోనూ గొప్ప సైంటిస్టుగా పేరు తెచ్చుకోవడంతో ప్రభుత్వం ప్రత్యేకమైన సెక్యూరిటీ ఏర్పాట్లు చేసింది. ఇరవైనాలుగు గంటలు అతనికి తెలీకుండానే మిలిటరీ ఏజెంట్లు అతన్ని కాపలా కాస్తున్న విషయం శాస్త్రికి తెలియకున్నా, తనకు తెలుసు. అందుకే చాలా జాగ్రత్తగా, తెలివిగా, తాను పని సాధించదలచుకొంది.

మద్రాసులో విమానం ఆగింది. బ్రీఫ్ కేసుతో దిగి వెలుపలికొచ్చింది. కస్టమ్స్ చెకింగ్ పూర్తయ్యాక పాసెంజరు లాంజ్ లోకొచ్చి నిలబడింది.

ఒకతను ప్రక్కగా వచ్చి "యం. ఎస్. వై ఫోర్ త్రీస్" అన్నాడు. అది తాను ఎక్కవలసిన కారు నెంబరయివుండాలనుకొని వెళ్ళింది వెలుపలకు. పోర్టికోలోవున్న కార్ల నెంబర్లకేసి చూసుకుంటూ వెళ్ళింది. పోర్టికోకు కాస్త దూరంగా నిలబడివుంది నల్ల అంబాసిడర్. నెంబరు చదువుకుంది. బ్యాక్ డోర్ తెరచుకుని ఎక్కి "గో ఆన్!" అంది.

కారు మద్రాసు మహానగరపు వీధుల్ని చీల్చుకుంటూ రివ్వున వెళ్ళసాగింది. డ్రైవరు తప్ప మరెవ్వరూ లేరు.

హోటల్ ఎమరాల్డ్ ముందాగింది కారు. డ్రైవరు

తాళాలరింగు తీసిచ్చాడు. రింగుకి వ్రేలాడుతున్న ఇత్తడి బిళ్ళ తీసి చూసింది. రూం నెంబరు నాలుగొందల నలభై నాలుగు అని వుంది. తనకోసం తనవాళ్ళు రిజర్వ్ చేసిన రూం అదే అయివుండాలనుకొంది. కారుదిగి, బ్రీఫ్ కేసుతో సహా లిఫ్టువేపు వెళ్ళింది.

ఆరో అంతస్తులోవున్న రూంని చేరుకుంది. లోని కెళ్ళి తలుపులకు గొళ్ళెం పెట్టింది. ఏర్పాట్లన్నీ ఎంతో బాగున్నందుకు సంతోషపడింది. తనకు అప్పగించబడినది చాలా కష్టసాధ్యమైన కార్యం. సాధించగలిగితే...

టెలిఫోన్ మ్రోగింది. లేచి రిసీవరు అందుకొని "హలో!" అంది సుసనా.

"సుఖంగా చేరావా?" అవతలివేపునుండి మగకంఠం వినిపించింది.

"ఆఁ! విశేషాలేమైనా ఉన్నాయా?" అడిగింది.

"రాత్రికి ఓడియన్‌లో కలుసుకుందాం. నీకోసం వెయిట్ చేస్తుంటాను వెలుపల" అన్నాడు అవతలి వ్యక్తి.

"అలాగే!" అంది సుసనా.

లైన్ కట్ అయిన శబ్దమయింది.

రిసీవరు క్రేడిల్ పైన పడేసింది సుసనా.

2

ఆర్మీ హెడ్ క్వార్టర్సులోని, ఇంటలిజెన్స్ వింగ్‌లోని సీనియర్ డైరక్టరు గది వెలుపల ఎర్రలైటు వెలిగింది. లోపల ముగ్గురు వ్యక్తులు కూర్చున్నారు. ఇద్దరు ఉన్నతాధికారులు. మరొకతను వాళ్ళు చెప్పేది శ్రద్ధగా వింటున్నాడు.

ప్రొఫెసర్ శాస్త్రి ఇండియానుండి బయలుదేరాక, అతను ఎవరెవరితో తిరిగిందీ, ఎక్కడెక్కడ మకాం

చేసిందీ, ఏమేం మాట్లాడింది అంతా వివరంగా రికారుచేసిన ఫైలు తిరిగేస్తూ కూర్చున్నాడు సీనియర్ డైరక్టరు.

"మిస్టర్ మోహన్! ఈ ఫోటోల్లో ఒక వింత విషయం గమనించారా?" అడిగాడు డైరక్టరు.

"ఏమిటి?"

"ఈ అమ్మాయెవరోగానీ, శాస్త్రిగారు వెళ్ళిన ప్రతి చోట ప్రత్యక్షమైంది. ప్రతి ఫోటోలో వుంది. చివరకు ఆయన వెంట విమానంలో ప్రయాణంచేసింది. ఇండియాకు చేరింది. మీ రిపోర్టునుబట్టి ఆమె మద్రాసుకు వెళ్ళింది. ఈమె ఎందుకిలా శాస్త్రిని వెంటాడుతున్నట్లు?" అడిగాడు సీనియర్ డైరక్టరు.

మోహన్ కూడా ఫోటోలన్నీ తదేకంగా పరీక్షించి చూశాడు.

"యస్ సార్! ఆమె కూడా సైంటిస్టేమో?" తన అనుమానం వ్యక్తపరిచాడు మోహన్.

"ఆమె సైంటిస్టయితే ఏ సెమినార్‌లోనూ మాట్లాడినట్లు లేదు. అన్నింటినీ మించి ఆమె శాస్త్రిగారొచ్చిన విమానంలోనే ఇండియాకు ఎందుకు రావలసివచ్చింది."

"కాకతాళీయంగా జరిగిందేమో?"

"కావచ్చు. కానీ ఇలాంటి కాకతాళీయంగా జరిగే పనులు నమ్మశక్యంగానివి. అలా నమ్మకపోవడంలోనే మనకు ఎక్కువ జాగ్రత్త వుంటుంది. మీకు తెలుసు. భారతదేశానికీ, ముఖ్యంగా సైనిక దళానికి శాస్త్రిగారి శాస్త్ర పరిజ్ఞానం ఎంతో అవసరం. ఆయన పేరు ప్రఖ్యాతులు ప్రపంచమంతా ప్రాకాయి. ఆధిక్యతకోసం, అధికారంకోసం తహతహలాడే దేశాలు, ఆయన్ని అపహరించుకుపోవడానికి ప్రయత్నాలు ప్రారంభంచేస్తాయి. ఈ

అమ్మాయి అలాంటి పథకంలోనే బహుశా ఇండియాకు వచ్చి వుంటుందని నాకు అనుమానంగా వుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడంకన్నా ముందే తగిన జాగ్రత్తలో వుండటం మంచిది. ఈ క్షణంనుండి ప్రొఫెసర్ శాస్త్రినీ, ఈ అమ్మాయినీ, కనిపెట్టి వుండటం అవసరం. అందుకు తగిన ఏర్పాట్లు చెయ్యి" అన్నాడు మోహన్ కేసి చూస్తూ సీనియర్ డైరక్టరు.

"యస్ సార్! అలాగే."

"ఇప్పుడిప్పుడే ఇది ప్రభుత్వం దృష్టికి తేనవసరంలేదు. ఎక్కడా మనం రంగంలో దిగివున్న విషయం వెలుపలకు రాకూడదు. లోకల్ పోలీసులతో పేచీలుగానీ, మరే విధమైన చిక్కులుగానీ తెచ్చుకోవద్దు. దానివల్ల లేనిపోని పబ్లిసిటీ మొదలయి అసలు పని చెడుతుంది. పిట్టలు ఎగిరిపోయే ప్రమాదంకూడా వుంది" అన్నాడు ఆయన.

మోహన్ వింటూ "శాస్త్రిగార్ని హెచ్చరిస్తే..." సూచించాడు.

"వద్దు! ఆయనకూడా మనం ఏంచేస్తున్నదీ తెలియకూడదు!" అన్నాడు డైరక్టరు.

మోహన్ సెలవు తీసుకుని వెలుపలకు వచ్చాడు. విజిటర్స్ రూంలో వెయిట్ చేస్తున్న అతని అసిస్టెంటు మంజుల, మోహన్ రావడం గమనించి లేచి నిలుచుంది.

"సారీ! చాలాసేపు ఒంటరిగా వుంచేశాను" అన్నాడు మోహన్.

"ఫరవాలేదు!" అంది.

ఇద్దరూ మెట్లు దిగి క్రిందికొచ్చి కారెక్కారు.

మంజులతో మోహన్ అంతా చెప్పాడు. మంజుల మధ్య మధ్య ఊకొడుతూ వినింది.

"అయితే మనమేం చెయ్యాలి!" అడిగింది మంజుల.

"నువ్వు ఈ దినం ప్లేన్‌లో మద్రాసు వెళ్ళు. నేను ఇక్కడ శాస్త్రిగారి సెక్యూరిటీకి యింకొన్ని ఏర్పాట్లు చేస్తాను. పని పూర్తికాగానే వచ్చేస్తాను. ఈలోగా నాకు రోజు నువ్వు తెలుసుకున్న విషయాలు తెలుపుతూ వుండాలి!" అన్నాడు మోహన్.

"మద్రాసులో ఆమె మకాం తెలుసా?"

"తెలీదు. ఫోటో వుంది ఇస్తాను. ఆమె ఫారిన్ లేడీ. అందంగా వుంటుంది. కనిపెట్టడం నీకు అంత కష్టం గాదనుకుంటాను" అన్నాడు ఫైలులోంచి ఫోటో ఒకటి లాగి అందిస్తూ.

"అలాగే!" అంది మంజుల.

కారు డిఫెన్సు హోస్టలు ముందాగింది.

"నువ్వెళ్ళి బట్టలు వగైరా సర్దుకొని తెచ్చుకో! ప్లేన్‌లో వెళ్ళిపోదువుగాని" అన్నాడు మోహన్.

మంజుల దిగి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన వైపే చూస్తూ కూర్చున్నాడు మోహన్.

మంజుల పెద్ద ఆర్మీ ఆఫీసరు కుమార్తె. ఆమె తండ్రి పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో చనిపోయాడు. ప్రభుత్వం ఆమెకు వేరే ఉద్యోగం ఇస్తానన్నా వినకుండా ఆర్మీలో చేరింది. బాగా చదువుకొంది కావడంవల్ల మంచి పోస్టు ఇచ్చేందుకు ప్రభుత్వంకి ఇబ్బంది లేకుండా పోయింది.

మోహన్, మంజుల కలసి పని చెయ్యడం ప్రారంభించి మూడేళ్ళయింది. అప్పగించిన పనిని సాధించడంకోసం, అనుక్షణం, అవసరమైతే ప్రాణాలను పణంగా పెట్టడం అతనికి అలవాటు. మంజుల అతనికన్నా పదిరెట్లు ఎక్కువ సాహసం, చొరవ చూపిస్తుంది. అందుకే వీళ్ళిద్దరూ మంచి

పేరు సంపాదించుకున్నారు సీనియర్ డైరక్టరువద్ద.

మోహన్ రెండు సిగరెట్లు తగలబెట్టాడు.

మంజుల చిన్న బ్రీఫ్ కేస్ పట్టుకొని వస్తూండటం దూరాన్నుంచే గమనించి కారు స్టార్టు చేశాడు.

మంజుల వచ్చి "కాస్త లేటయింది" అంది ఎక్కి కూర్చుంటూ.

"ఫరవాలేదు" అన్నాడు ఆక్సిలేటరు పైన కాలు పెడుతూ.

"మిస్టర్ మోహన్! ప్రొఫెసర్ శాస్త్రిని ఎత్తుకు పోయేందుకు వాళ్ళు ఎలాంటి ఎత్తులు వేస్తుంటారో మీ రూహించగలరా?" అడిగింది మంజుల.

"అందమైన అమ్మాయిని అంత దూరంనుంచి పిలుచుకొచ్చి రంగంలో ప్రవేశపెట్టారంటే, బహుశా అతన్ని ఆమె మైకంలో పడేట్లుచేసి ఆమె ద్వారా అతని దగ్గరున్న ఫార్ములాల్ని, అతన్ని లేదు దేశానికి తరలించుకు పోయేందుకు ప్లాన్ చేసి వుంటారనిపిస్తూంది. కానీ అది ఖచ్చితంగా చెప్పలేను. సైన్సు సాధించిన ప్రగతితో ఇలాంటి నేరాల పద్ధతే, మారిపోయింది. ఆ అమ్మాయి గురించి అవసరమైన అన్ని వివరాలు నువ్వు సేకరించాలి. దానిపైనే మన విజయం ఆధారపడి వుంటుంది" అన్నాడు మోహన్.

"నా సాయశక్తులా ప్రయత్నిస్తాను" అంది మంజుల.

కారు పాలం విమానాశ్రయం చేరుకుంది.

మద్రాసుకు వెళ్ళేందుకు విమానం సిద్ధంగా వుంది. మంజుల మోహన్‌కు చెప్పి రన్ వే వేపు వెళ్ళిపోయింది.

విమానం గాలిలోకి లేచిందాకా అక్కడే నిలబడ్డాడు మోహన్. అది కనుమరుగుకాగానే పోర్టికోలోకి వచ్చి కారెక్కాడు.

కారు శాస్త్రిగారి బంగళావేపు పోనిచ్చాడు. అరగంట పట్టింది ఆయనిల్లు చేరుకునేందుకు.

గేటు దగ్గర కాపలా వున్న జవాన్ మోహన్‌ను చూడగానే సెల్యూట్ చేశాడు.

"సాబ్ వున్నాడా?" అడిగాడు మోహన్.

"వెలుపలకు వెళ్ళారు సార్!" చెప్పాడు.

కార్ను ముందుకు పోనిచ్చాడు. బంగళాకు కుడివేపు వున్న చిన్న ఔట్ హౌస్ ముందాపాడు కారు. ఆ బంగళా సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ అందులోనే వుంటాడు. వెలుపలికొచ్చి మేజర్ మోహన్‌ను చూచి, వడివడిగా పరుగెత్తుకొచ్చాడు అతను.

"ఏర్పాట్లు ఎలా వున్నాయి?" అడిగాడు అతన్ని మోహన్.

"మామూలే సార్!" అన్నాడతను.

"ఓమారు చూడాలి! శాస్త్రిగారు లేరుగా?" అన్నాడు.

"లేరు సార్!" అంటూ అతని వెంట నడిచాడు.

మోహన్ ముందు బంగళా చుట్టూ తిరిగాడు. కాంపౌండ్ వాల్ కేసి చూశాడు. ఐదడుగుల ఎత్తు వుంటుంది. ఎవరైనా సులభంగా దూకి లోనికి రావచ్చు.

"బంగళా చుట్టూ ఎంతమంది కాపలా వున్నారు?"

"ఒక్క సిపాయి వుంటాడు సార్. రాత్రంతా పహరా తిరుగుతూనే వుంటాడు."

"ఎవరైనా సులభంగా గోడదూకి లోనికి రావచ్చు. ఇద్దరు మనుషులు వచ్చారంటే మన జవాన్ను సులభంగా లొంగదీసుకోగలరు. ఇది బాగాలేదు. ఇంతకు ముందులా అశ్రద్ధ పనికిరాదు. చాలా జాగ్రత్తగా వుండాలి. ముందు కాంపౌండ్ వాల్ పైన రెండడుగుల ఎత్తున ఐరన్ మెష్

వేయించండి. దాంట్లోకి ఇరవై నాలుగు గంటలు కరెంటు పాసయ్యే ఏర్పాట్లు చేయించాలి. రాత్రిళ్ళు ఇంటిచుట్టూ నలుగుర్ని కాపలా పెట్టు. అర్థమయిందా?" అడిగాడు మోహన్.

"యస్ బాస్!" అన్నాడతను.

"లోనికి పద!" అంటూ దారితీశాడు మోహన్.

ఇద్దరూ లోనికి నడిచారు.

శాస్త్రిగారి లాబొరేటరీ అండర్ గ్రౌండ్‌లో వుంది. హాలు మధ్యనున్న ద్వారం ద్వారా క్రిందకి మెట్లమీదుగా వెళ్ళాలి అందులోకి. శాస్త్రితోపాటు మరి కొంతమంది కూడా అందులో పనిచేస్తున్నారు.

మేడ పైభాగాన మూడు గదులున్నాయి. ఆ గదులన్నీ క్షుణ్ణంగా పరిశీలించాడు. డ్రైనేజి, వాటర్, పైపులు క్రిందికి వున్నాయి. వాటిని ఆసరగా తీసుకొని ఎవరైనా పైకి ఎక్కి వచ్చే ప్రమాదముందని గ్రహించిన మోహన్, ప్రక్కనున్న సెక్యూరిటీ ఇన్‌ఛార్జికి తన అభిప్రాయం తెలిపాడు.

"ఏం చెయ్యమంటారు?" అడిగాడు అతను.

"గోడను మధ్యకు పగుల గొట్టించి, మధ్యగా ఆ పైపులు పోయే ఏర్పాట్లు చేయించండి" అన్నాడు మోహన్.

అతను అలాగే అంటూ తలూపాడు.

కారెక్కబోతూ "మీరంతా అప్రమత్తులై వుండాలి. అతిత్వరలో ఆయన్ను అపహరించడానికి ఒక పెద్ద ముఠా ప్రయత్నం చేసే సూచనలు కనుపిస్తున్నాయి. ఆయన్ని చూడను వచ్చే ప్రతి మనిషినీ జాగ్రత్తగా పరిశీలించండి. కంటికి రెప్పలా కాపలా కాస్తూవుండండి!" అన్నాడు మోహన్.

అందుకు అలాగే నన్నట్లు తల జోరుగా ఊపాడు.

మోహన్ కారెక్కి వెళ్ళిపోయాడు.

3

ఓడియన్ ముందాగిన టాక్సీలోంచి దిగింది సుసనా. డబ్బిచ్చి లోనికి వెళ్ళింది. కాఫీ బార్ ముందు నిలుచున్న కాఫీ కలర్ సూట్ వాలాను చూసి నవ్వింది.

అతను కూడా నవ్వాడు. ఆమె అతని దగ్గరగా వెళ్ళింది.

"షో ప్రారంభం కాబోతుంది. వెళ్దామా లోనికి" అడిగాడతను ఇంగ్లీషులో.

"వెళ్దాం!" అంది సుసనా.

ఇద్దరూ ఒకరి చేతిలో మరొకరి చెయ్యి పట్టుకొని వెళ్ళారు. అతను హిప్పీలా జుట్టు పెంచివున్నాడు.

ఎప్పటిదో పాత చెత్త ఇంగ్లీషు సినిమా కావడంవల్ల, హైకాసులో అసలు జనమే లేరు. ఎవ్వరూ లేనిచోట ఒక మూలగా కూర్చున్నారిద్దరూ.

సినిమా మొదలయింది.

దాంతోపాటు వాళ్ళ సంభాషణ కూడా మొదలయింది.

"ప్రొఫెసర్ ఎలా వున్నాడు."

"మార్వెలస్. నన్ను చూడగానే అతనిలో కాస్త మార్పు కనుపించింది."

"నీ గురించి వివరాలు అడిగాడా?"

"ఆఁ! ఏదో చెప్పాను."

"ఆ తర్వాత."

"ఇండియా వదిలి వెళ్ళేముందు ఒకమారు వచ్చి తనతో కొద్ది రోజులుండి వెళ్ళమన్నాడు."

"వండర్‌ఫుల్! మన పని చాలా సులభంగా జరిగేట్లుంది," అన్నాడు అతను.

"ఇది సాధిస్తే...మనకు జీవితంలో దేనికీ లోటు లేకుండా చేస్తుందట మన ప్రభుత్వం" అంది ఆమె.

"ఇంతకు ముందు దాకా జరిగిన దొంగతనాలు, దోపిడీలు, సైంటిస్టుల అపహరణలు మన ప్లాను ముందు బలాదూరు. అభివృద్ధి చెందిన శాస్త్రంతోపాటు, మన పద్ధతులు కూడా అభివృద్ధి చెందాయి" అన్నాడతను.

"నువ్వేం చెబుతున్నావో నాకు అర్థంకావటేదు." అంది సుసనా.

"చెబుతాను" అంటూ చీకట్లోనే చుట్టూ పరికించి చూశాడు. ఎవ్వరు దగ్గరలో మనిషి కనుపించకపోవడంతో ధైర్యం తెచ్చుకొని ఆమె చెవిపైకి తన నోరు పెట్టి చెప్పడం మొదలెట్టాడు.

"ప్రొఫెసర్ శాస్త్రిది చాలా గొప్ప బ్రెయిన్. మనకు మనిషితో పనిలేదు. కావలసింది అతని విలువైన మెదడు. దాన్ని దొంగిలించుకుపోతే చాలు" అన్నాడు.

"ఆఁ!" అంటూ ఆశ్చర్యపోతూ పిరుదులు సర్దుకుని కూర్చుంది నిటారుగా సీట్లో సుసనా.

"ఎందుకలా ఆశ్చర్యపోతున్నావ్?"

"అదెలా సాధ్యం!"

"అసాధ్యమనేది ఏదీ ప్రపంచంలో లేదు. బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చెయ్యడంలో పేరుపొందిన డాక్టర్‌ను శాస్త్రి మెదడును వెలికితీసి, సురక్షితంగా మనదేశం తీసుకుపోయేందుకు ఏర్పాట్లు చేసి వుంచాం. నువ్వు చెయ్యవలసిందల్లా శాస్త్రిని నమ్మించి, అతని మనిషిగా కొద్ది దినాలు లోపలుండటం. ఆ ఆపరేషన్‌కు అవసరమైన మెడికల్ కిట్‌ను ఒక్కొక్కటి లోనికి చేరవెయ్యడం. ఆ తర్వాత ఆపరేషను జరగవలసిన రోజున ఇద్దరు డాక్ట

ర్లను లోనికి ప్రవేశపెట్టడానికి తగిన ఏర్పాట్లు చేసి వుంచడం. అంతే! మిగిలిందంతా సవ్యంగా జరిగిపోయేట్లు చూసే పూచీ నాది" అన్నాడు. ఆగంతకుడు.

"వింటుంటే విచిత్రంగా వుంది. ఏదో కథలో చదువుతున్నట్లుంది. ఈ గందరగోళంకన్నా ఆయన్ని అపహరించుకుపోవడం సులభంకాదూ!" అడిగింది సుసనా.

"లాభంలేదు. మనిషి లేకపోవడంతో ప్రభుత్వం తమ యంత్రాంగాన్ని మనపైన వదలుతుంది. మనం ఈ దేశం సరిహద్దుల్ని కూడా దాటిపోలేం" అన్నాడతను మళ్ళీ.

"ఆల్ రైట్ ఇలాంటి విషయాల్లో నాకు అనుభవం తక్కువ. మీరేం చెయ్యమంటే అది చేస్తాను" అంది సుసనా.

"ఆపరేషన్ జరిగేప్పుడు అస్సీషియా నువ్వే ఇవ్వాలి. అందులో నువ్వు ఎక్స్‌పర్ట్‌వి. అందుకే నిన్ను వినియోగించమని కోరాను."

"ఓ. కే. అలాగే!"

ఆ తర్వాత సినిమా చూడటంలో నిమగ్నమయినారు. ఇంటర్వెల్ అయింది. లైట్లు వెలిగాయి. ఇద్దరూ వెలుపలికి వొచ్చారు.

కాఫీ బార్ ముందు నిలబడి ఐస్ క్రీమ్ కాఫీ త్రాగుతూ నిలుచున్నారు.

మంజుల కూడా వచ్చి, బార్‌లో డబ్బిచ్చి కాఫీ తీసుకుని, వాళ్ళకు కొద్ది దూరంలో నిలుచుని కాఫీ త్రాగడం మొదలెట్టింది.

ఢిల్లీనుండి వచ్చాక నాలుగు గంటలసేపు మద్రాసు మహానగరంలో వున్న సెవన్ స్టార్ హోటల్స్ మొత్తం టాక్సీలో తిరిగింది. సుసనా ఫోటో చూపించి ఆమెను

గురించి వాకబు చెయ్యసాగింది. అడిగినవాళ్ళకు తన్ను ఫలానా హోటల్‌లో కలుసుకోమని చెప్పిందనీ, తీరా అక్కడికి వెళ్ళి అడిగితే వాళ్ళు ఆ హోటల్‌లో దిగ లేదని చెప్పారనీ, అందువల్లే వెదుక్కుంటూ తిరుగుతున్నాననీ, అందంగా అబద్ధం చెప్పి, వాళ్ళకు ఏ విధమైన అనుమానం కలుగకుండా జాగ్రత్తపడింది.

చివరకు ఎమరాల్డ్ హోటల్‌లో ఆమె ప్రయత్నం ఫలించింది. సుసనాకోసం అంతకు రెండు దినాలముందే రూం రిజర్వు చేసి వుంచారనీ, అందువల్ల ఆమె దిగి తిన్నగా గదికి వెళ్ళిపోయిందనీ, తను చూసే అవకాశం అసలు లేకనే వుండేదని అంటూ వాపోయినట్లు మాట్లాడాడు రిసెప్షనిస్టు.

"ఈమెను చూడకుండానే ఈ హోటల్లో వుందని ఎలా చెప్పావు?" అడిగింది మంజుల.

"ఆ రూం బాయ్‌వచ్చి మాటల్లో చాలా అందంగా వుంటుందని చెప్పాడు. నాకు ఫారినర్స్ అంటే కాస్త పిచ్చి. చెప్పగానే వెళ్ళి చూశాను. అన్ని ఏర్పాట్లు బాగున్నాయా అంటూ ఆమెను మాట్లాడించి చూశాను" అన్నాడు.

బ్రతుకు జీవుడా అనుకుంటూ, సుసనాకోసం వెయిట్ చేస్తూ ఎమరాల్డ్ హోటల్ కెదురుగా వున్న బ్యూటీ హెయిర్ డ్రెస్సింగ్ సెలూన్‌లో కూర్చుంది. అన్ని కుర్చీల్లో జనం వుండడంతో ఆమెకు తీరిగ్గా కూచునే అవకాశం లేదు. అది ఆడవాళ్ళకు హెయిర్ డ్రెస్ చేసే సెలూను.

అరగంట తర్వాత టాక్సీలో వెళ్తూ కనుపించింది.

తక్కున వెలుపలికొచ్చి ఆటో తీసుకొని టాక్సీని అనుసరించమని పురమాయించింది. ఓడియన్ కు దూరంగాదిగి

నడచి వచ్చింది. వాళ్ళను లోనికి పోనిచ్చి, తనుకూడా వెళ్ళింది మంజుల. ముందు వాళ్ళకు దగ్గరలోనే వెళ్ళి కూర్చుందామనుకుంది. కానీ వాళ్ళ దృష్టిని అనవసరంగా తనవేపు ఆకర్షించుకోవడం అవివేకమైన చర్యనుకొని దూరంగా కూర్చుంది.

కాఫీ గ్లాసులు బార్ కౌంటర్ పైన వుంచి లోనికి నడిచారు ఇద్దరూ.

మంజుల వాళ్ళ వెంటే వెళ్ళింది.

ఆమెకు సుసనా ప్రక్కనున్న మగమనిషి ఎవరో, ఎక్కడుంటున్నాడో, అతనికీ, సుసనాకు సంబంధం ఏమిటో తెలుసుకోవడం చాలా అవసరంగా తోచింది. షో వదిలాక అతన్ని అనుసరించిపోవడం మంచిదని నిర్ణయించుకొంది.

గంట తర్వాత హాల్లో లైట్లు వెలిగాయి.

అందరూ లేచి వెలుపలకొచ్చారు.

ఈమారు సుసనా అతనితో సంబంధం లేనట్లుగా వడివడిగా వెళ్ళి, టాక్సీ ఎక్కి వెళ్ళిపోయింది. అతను కారు పార్కింగ్ లోకి వెళ్ళి నల్ల అంబాసిడర్ కారెక్కి స్టార్టు చేశాడు.

లైటు వెలుగులో ఆ కారు నెంబరు నోట్ చేసుకుంది.

కారును అనుసరించి పోనిమ్మంది తనెక్కిన టాక్సీని. మద్రాసు నగరాన్ని దాటిపోసాగింది కారు మహాబలిపురం వేపు.

డ్రైవరు అనుమానంగా ఆమెకేసి చూశాడు.

"పోనీ!" అంది చెక్కుచెదరని ధైర్యంతో.

మెయిన్ రోడ్ పైనుండి చీలిపోయే సన్న రోడ్ పైకి మళ్ళింది కారు. టాక్సీకూడా దాన్ని అనుసరించింది.

అరమైలు పోయాక సముద్రపు ఒడ్డున మెర్క్యూరీ లైట్ల కాంతిలో చిన్న చిన్న గుడిసెలు కనుపించాయి. సింహద్వారం మీద నియాన్ సైన్స్ వెలుగుతున్నాయి. "గోల్డన్ కేజెస్" అని వున్న ఇంగ్లీషు అక్షరాలు చదువుకొంది.

కారు తిన్నగా లోనికి వెళ్ళిపోయింది.

టాక్సీ రిసెప్షన్ వద్ద ఆగింది.

మంజుల దిగి లోనికి వెళ్ళింది. డెకోలమ్ టేబుల్ కావల కునికిపాట్లు పడుతున్న సూట్‌వాలను నిద్ర లేపేందుకన్నట్లు హాండ్ బ్యాగ్‌ను బలంగా కొట్టింది టేబుల్ పైన. అతను కళ్ళు తెరచి మంజులను చూసి "యస్. మేడమ్!" అన్నాడు.

"ఖాళీ వుందా?" అడిగింది.

"సారీ! అన్నీ బుక్ అయినాయి" అన్నాడు అతను.

"నిద్రమత్తులో వున్నట్లున్నావు. ఓ మారు మళ్ళీ రిజిస్టరు నింపాదిగా చూసి చెప్పు. పాతిక రూపాయలు ఖర్చుపెట్టుకొని టాక్సీలో వచ్చాను" అంది మంజుల.

"రియలీ సారీ! ఇంతదాకా రాకుండా ఫోన్ చేసి వుంటే విషయం చెప్పేవాణ్ణి. మీకు పాతిక రూపాయలు మిగిలేవి" అన్నాడతను.

అంతలోనే సినిమా హాలునుండి మంజుల వెంటాడుకుంటూ వచ్చిన వ్యక్తి లోనికొచ్చి "కార్ కీస్!" అంటూ తాళాల రింగును గిరవాటు వేశాడు.

"అయితే లాభం లేదంటావా?" అడిగింది మంజుల.

"మీకు అకామిడేషన్ లేదంటున్నాడా?" అడిగాడు కల్పించుకొని ముందుకొచ్చి మంజులతో మాటలు కలుపుతూ.

"అవునండీ!" అంది మంజుల.

"మీరొక్కరేనా?" అడిగాడు అతను.

ఏం చెప్పాలని ఆలోచించిందో క్షణం. అతనికి తను ఒంటరి దాన్నని తెలుపటం ఇష్టం లేకపోయింది.

"ప్రస్తుతం ఒంటరిగానే వచ్చాను. కేజ్ దొరికితే ఫోన్ చెయ్యమన్నాడు నా బాయ్ ఫ్రెండ్. ఆ అదృష్టం వున్నట్లు లేదు" అంది మంజుల.

"సారీ! ఒక్కరయితే నాతో వుండొచ్చు. నేను రాత్రిళ్ళు సముద్రపు ఒడ్డున ఇసుకలో పడుకుంటూ వుంటాను మామూలుగా?" అన్నాడతను.

"అలాంటప్పుడు నా ఫ్రెండ్‌ను రమ్మంటే మాత్రం మీకేం అభ్యంతరం" అడిగింది మంజుల.

"ఐదింటికల్లా నేను స్నానం చేస్తాను. మీరు ఆ టైముకు ఖాళీ చెయ్యలేరుగా?" అన్నాడు నవ్వుతూ.

"అంతకు ముందుగానే ఖాళీచేసి వెళ్ళిపోతాం" అంది మంజుల.

"అయితే నాకేం అభ్యంతరం లేదు. మీ ఫ్రెండ్‌కు ఫోన్ చేసి ఆరో నెంబరుకు రండి" అంటూ అతను వెళ్ళిపోయాడు.

మంజుల టాక్సీకి డబ్బిచ్చి పంపేసింది.

టెలిఫోన్ తీసుకొని ఒక నెంబరుకు డయల్ చేసి చెప్పింది రమ్మని. ఆ తర్వాత ఫోన్ పెట్టేసి ఆరో నెంబరు కడ్ వైపు వెళ్ళింది.

పేము కుర్చీలో కూర్చుని తాపీగా విస్కీ త్రాగుతున్నాడు అతను.

"రండి! కూర్చోండి!" అంటూ ఆహ్వానించాడు.

అతని కెదురుగా కూర్చుంది మంజుల.

"ఈ దేశంలో ప్రేమించుకున్న జంటలు ఇలా దొంగతనంగా ఎందుకు కలుసుకుంటూ వుంటారో నాకు అర్థం కావడం లేదు. మీరు చేసేది తప్పనిపిస్తుంటుందా?" అడిగాడతను సిగరెట్ కాలుస్తూ.

"కాదు! పెద్దవాళ్ళంటే గౌరవం. మీ దేశంలో విచ్చలవిడిగా తిరుగుతారా?"

"ఆఁ! ఒక విధంగా."

"మేమింకా అంత ముందుకు పోలేదు!" అంది మంజుల కళ్ళతో గదినంతా పరిశీలించి చూస్తూ.

"మీ ఫ్రెండ్ కు ఫోన్ చేశారా?"

"ఆఁ! ఇంతకూ మీది ఏ దేశం. ఇక్కడేం చేస్తుంటారు."

"నాది ఏ దేశమయినా దానికి గుడ్ బై కొట్టేశాను. కృష్ణ భక్తుణ్ణి. ఇక్కడే వుందామని వచ్చేశాను."

"ఇలా ఆడంబరంగా జీవించేందుకు డబ్బు ఎలా వస్తుంది?"

"మా ఫాదర్ కు కావలసినంత వుంది. వద్దన్నా పంపుతుంటాడు" అన్నాడతను.

"లక్కీ పీపుల్!" అంది మంజుల.

"అతనొచ్చే దాకా కూర్చుంటాను. ఆ తర్వాత వెళ్ళిపోతాను" అన్నాడు అతను.

"అలాగే! మీ పేరు చెప్పారు కాదు?" గుర్తుచేసింది.

"క్రిష్ణ సేవక్ అనండి చాలు" అన్నాడు.

"వండర్ ఫుల్!" అతని పేరును మెచ్చుకుంది.

ఆరడుగుల ఆజానుబాహు విగ్రహాన్ని గుమ్మంలో నిలుపుకొని "లోనికి రావచ్చా!" అడిగాడు శేఖర్. మద్రాసులో ఆర్మీ ఇంటలిజెన్సుకు అధిపతి అతను.

"మీ కోసం చూస్తున్నాను" అంటూ ఎదురు వెళ్ళి

ఆహ్వానించు కొచ్చింది మంజుల అతన్ని. ఒకర్నొకరు పరిచయం చేసుకున్నారు.

"నేను వెళ్తాను" అంటూ లేచాడు కృష్ణసేవక్.

"మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నట్లున్నాం!" అన్నాడు శేఖర్.

"అలాంటిదేమీ లేదు" అన్నాడు సేవక్ లేచి వెళ్తూ.

అతను దూరంగా వెళ్ళిపోయాడని తీర్మానించుకొన్నాక ఇద్దరూ తలుపులు దగ్గరగా మూసి కూర్చున్నారు.

"ఇప్పుడేం చెయ్యాలి!" అడిగాడు శేఖర్.

"నిజంగానే బాయ్‌ఫ్రెండ్ ననుకొని మాత్రం నాపైన పడకు" అంది నవ్వుతూ మంజుల.

పకాపకా నవ్వాడు శేఖర్.

ఆ గదిలో సామానులన్నీ క్షుణ్ణంగా పరిశోధించారు. ఏవైనా వాళ్ళ రహస్యాలు పట్టిచ్చే పత్రాలు దొరకుతాయేమోనని చూశారు. కానీ లాభంలేక పోయింది. మెడికల్ సర్జరీ గురించిన పెద్ద పెద్ద పుస్తకాలు మాత్రం వున్నాయి.

"ఇతను డాక్టరులాగున్నాడు" అంది మంజుల.

"అవును" అన్నాడు శేఖర్.

"అంతా అయోమయంగావుంది. ప్రొఫెసర్ శాస్త్రిని వల్లో వేసుకోను ప్రయత్నించిన సుసనా, ఈ కృష్ణసేవక్ బహుశా ఒక దేశానికే సంబంధించిన వాళ్ళయివుండాలి. లేదా ఒకే గాంగుకు చెందిన మనుషులయి వుంటారు" అంటూ అంతకుముందు ఓడియన్‌లో వాళ్ళు సినిమా చూసిన వైనం, తను వెంబడించడం వివరంగా చెప్పింది మంజుల.

"ఇప్పుడేంచేద్దాం!" అడిగాడు శేఖర్.

"ఎలక్ట్రానిక్ వైర్‌లెస్ ట్రాన్స్‌మిటర్ తెచ్చాను.

అతనికి కనుపించకుండా వుండేచోట పెడదాం. దాని రిసీవరు మీ ఆఫీసులో పెట్టు. ఇతని రహస్యాలన్నీ సులభంగా తెలుసుకోగలుగుతాం."

"అలాగే!" అన్నాడు శేఖర్.

మంజుల హాండ్ బ్యాగ్ తెరచింది. అందులోంచి చిన్న ఇన్స్ట్రుమెంట్ తీసి స్విచ్ ఆన్ చేసింది. లోపలంతా వెతికి, చివరకు పైకప్పులో పెట్టడం క్షేమమని తీర్మానించుకున్నారు. స్టూలు సాయంతో శేఖర్ దాన్ని పైనున్న కొబ్బరి ఆకుల్లో దూర్చాడు.

ఆ చిన్న యంత్రానికి కరెంటు అవసరం లేదు. రీచార్జింగ్ బాటరీ సెల్స్ వున్నాయి. వాటంతటవే చార్జ అవుతుంటాయి. ఎన్ని దినాలయినా అంతరాయంలేకుండా పనిచేస్తుంది.

"మనం వచ్చిన పని అయినట్లే!" అన్నాడు శేఖర్ వాచీ చూసుకుంటూ. గంట మూడయింది. ఇంకో రెండు గంటలు గడిస్తేగానీ కృష్ణసేవక్ గదిలోకి రాడు. పిచ్చాపాటి మాట్లాడుకుంటూ గడిపారు.

ఐదు ప్రాంతాల్లో తలుపుతట్టిన శబ్దమైంది. శేఖర్ వెళ్ళి తలుపు తెరిచాడు.

"నిద్రపోలేదా?" అడిగాడు కృష్ణసేవక్ బెడ్ రోల్ తెచ్చి లోన పడేస్తూ.

సమాధానంగా నవ్వి "థాంక్స్! మేము వెళ్ళొస్తాం! మీ సాయానికి ఎంతో కృతజ్ఞులం!" అన్నాడు.

"నో మెన్షన్! నాకు గరల్ ఫ్రెండొకతె వుండేది. ఇలాగే నేను ఇబ్బందిపడ్డ సంఘటనలు వున్నాయి. అందుకే మీ బాధ అర్థంచేసుకున్నాను" అన్నాడు కృష్ణసేవక్

ఆ తర్వాత శేఖర్ కార్లో ఎక్కింది మంజుల. కారు మద్రాసునగరంవేపు పరుగు అందుకుంది.

4

కారు వెళ్ళాక లోనికొచ్చాడు కృష్ణ సేవక్. అతనికి నవ్వొచ్చింది. మంజులను హాల్లోనే గమనించాడు. ఆమె మాటిమాటికీ తమకేసి చూడటం, ఆ తర్వాత తన్ను కాల్లో వెంబడించడంకూడా కనిపెట్టాడు.

గోల్డన్ కేజ్ దగ్గర ఆమె నాటకమాడుతూండటం కూడా పసిగట్టాడు. తనపైన ఆమెకున్న అనుమానాన్ని పోగొట్టుదామనే ఉద్దేశ్యంతో, గది ఖాళీచేసి ఇచ్చాడు.

గదంతా పరిశీలించి చూశాడు. పుస్తకాలన్నీ ఎగుడు దిగుడుగా వున్నాయి. కుర్చీలు జరిపి వున్నాయి. సూట్ కేస్ స్థలం మారివుంది. అంటే వాళ్ళు రాత్రంతా తన వస్తువులు క్షుణ్ణంగా వెతికివుంటారనుకున్నాడు.

బెడ్ రోల్ విప్పి, అందులోంచి తలగడ వెలుపలకు లాగాడు. కవరుకూ, దిండుకూ మధ్య దాచిన మీటర్ను తీసి, దాని వైర్లను ప్లగ్ లో పెట్టి స్విచ్ ఆన్ చేశాడు. మీటర్ పైకి ముల్లు జుయ్యిమని ప్రక్కకు వాలింది. చూచి నవ్వుకున్నాడు. గదిలో ఎలక్ట్రానిక్ బగ్ లాంటిదో పెట్టి వెళ్ళినట్టు ఋజువయింది. దానికోసం గాలించాడు. కనుపించలేదు. మళ్ళీ మీటర్ తో చెక్ చేశాడు. అంతకుముందు లాగే రీడింగ్ చూపించిందది. ఇంకోమారు నిదానంగా వెతికాడు. ప్రయోజనం లేకపోయింది.

అంతదాకా తను క్రిందే వెతుకుతున్నానని తెలుసుకొన్నాడు. పైకప్పు కొబ్బరి ఆకులతో వేసింది. అందులో పెట్టే అవకాశంవుంది. స్టూలు వేసుకొని పైనంతా వెతికాడు. అతని ప్రయత్నం ఫలించింది. ఆ చిన్నయంత్రం దొరికింది. దాని స్విచ్ ఆఫ్ చేశాడు.

ఇండియన్ ఇంటలిజెన్స్ శాఖవారికి, సుసనా ఇండి

యాలో అడుగుబెట్టిన పన్నెండు గంటలలో తమపైన అనుమానం వేసిందన్న నగ్నసత్యం గుర్తొచ్చాక; కృష్ణసేవక్ లో కొంత కంగారు పుట్టింది. తమ రహస్యాల్నీ, పథకాల్నీ, పట్టివ్వనంతవరకూ, కార్యసాధనలో కష్టాలు రావన్న నమ్మకంకూడా ఓ మూల మెదలుతూనే వుంది.

ఎమరాల్డ్ హోటల్ కు ఫోన్ చేసి సుసనాను అర్జంటుగా ఇలియట్స్ బీచ్ లోవచ్చి కలుసుకోమని చెప్పాడు, కృష్ణసేవక్. ఆ తర్వాత రిసెప్షనులో కారుతాళాలు తీసుకుని బయలుదేరాడు.

ఇలియట్స్ బీచ్ కు పోయే త్రోవలో చిన్న సారా దుకాణం కనుపించింది. కారాపి, దిగి, వెళ్ళి అందులో దూరి రెండుగ్లాసులు పట్టించాడు. ఎవ్వరూ చూడకుండా దగ్గరున్న ఎలక్ట్రానిక్ ట్రాన్స్మిటర్ను చూరులో దోపి, చల్లగా వెలుపలకు జారుకొన్నాడు. కారెక్కి బీచ్ కు పోనిచ్చాడు.

అరగంట తర్వాత ఆటో దిగివచ్చింది సుసనా.

"నీకు ఫోన్ చేద్దామనుకుంటూ ఉండగా, నువ్వే ఫోన్ చేశావ్! ఏమిటీ హడావుడి?"

అడిగింది అతని కెదురుగా ఇసుకలో కూర్చుంటూ.

జరిగిందంతా చెప్పాడు వివరంగా. తదేకంగా వినింది సుసనా. ఆ తర్వాత తనూ చెప్పింది, అంతకు ముందు రోజు ఎవరో స్త్రీ ఎమరాల్డ్ హోటల్ కు వచ్చి తన ఫోటో చూపించి అడిగిన వైనం గురించి.

"ఆమే ఈమె!" అన్నాడు కృష్ణసేవక్.

"నా ఫోటో ఎలా దొరికిందామెకు?"

"ప్రొఫెసర్ శాస్త్రిని ప్రభుత్వం అనుమానం కాపలా కాస్తూవున్నట్లుంది. అతనితో మాట్లాడిన ప్రతీ మనిషిని

ఫోటోలు తీయిస్తున్నారేమో. నీమీద అంత తొందరగా అనుమానం ఎలా కలిగింది?'' అడిగాడు కృష్ణ సేవక్.

''అదే అర్థం కావడంలేదు!'' అంది సుసనా.

''మన హెడ్ క్వార్టర్సును కాంటాక్టు చేశాను. వివరాలు చెప్పాను. 'వాళ్లేమీ భయపడవద్దనీ, ప్లాను ప్రకారం పనులు కానివ్వమని సలహా ఇచ్చారు'' అన్నాడు కృష్ణ సేవక్.

''ఒకవేళ శాస్త్రికి మనగురించి చెప్పి, అతన్ని తగిన జాగ్రత్తలో ఉండమని ప్రభుత్వం సలహా ఇస్తే!''తన అనుమానం వ్యక్తపరిచింది సుసనా.

''అలా జరగదు. అటువంటి విషయాలు చెప్తే ఆయన మెదడు పరిశోధనల పైనుండి మరలి ప్రాణ రక్షణ విధానాలన్ని వెతుక్కోవడంలో మునిగిపోతుంది. అందువల్ల ఆయన్ను రక్షించే బాధ్యత తమ నెత్తినే పెట్టుకొంటారు.''

''అయితే ఇప్పుడు మనం చెయ్యవలసిందేమిటి?''

''త్వరగా పని ముగించుకోవడం. మేమంతా రెండు దినాల్లో ఢిల్లీ చేరుకుంటాం. నువ్వుకూడా చారిత్రాత్మకమైన ప్రదేశాలు కొన్ని చూచుకొని ఆదివారం సాయంత్రం ఆగ్రా నుండి తాజ్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరేట్లు రా. క్రొత్త ఢిల్లీకి శాస్త్రిని వచ్చి కలుసుకోమని వైర్ చెయ్యి. నువ్వెళ్ళి అతని బంగళాలో సెటిల్ అయ్యాక మేము నిన్ను కలుసుకుంటాం. పని ప్రారంభించేద్దాం. అక్కడ పరిస్థితులు నీకు ప్రతికూలంగా ఉంటే మాకు తెలియజెయ్యి. పథకం మారుస్తాం!'' అన్నాడు కృష్ణ సేవక్.

''అలాగే! కానీ ఎక్కడ కలుసుకోవాలి.''

''కన్నాట్ సర్కస్‌లో ఇండియా కాఫీ హౌస్ వుంది.

నేనూ రోజూ సాయంత్రం ఐదునుండి ఏడుదాకా అక్కడే ఉంటాను. ఫోన్లు మాత్రం ఉపయోగించవద్దు. సరేనా!'' అడిగాడు కృష్ణసేవక్.

"సరే!'' అంది సుసనా.

"మంజులను, శేఖర్‌ను నా కెమరాతో ఫోటోలు తీశాను. ఫిల్మ్ ఇందులోవుంది. డెవలప్ చేయించి, ప్రింట్లు తీయించి చూసుకో. వాళ్ళిద్దరిలో ఎవరో ఒకరు నిన్ను వెంబడించే అవకాశంవుంది. జాగ్రత్తగావుండు'' అన్నాడు చిన్న మినీ కెమెరా అందిస్తూ.

"అలాగే!'' అంది సుసనా.

ఆ తర్వాత ఇద్దరూ ఎవరిదోవన వాళ్ళు వెళ్ళిపోయారు.

సుసనా హోటల్ రూంలోకి వెళ్ళింది. తలుపు తెరచి చూసింది. గదంతా చిందరవందరగావుంది. ఎవరో సామాన్లన్నీ వెతికినట్లు అనుమానం వేసింది. ఫ్లోర్ సూపర్‌వైజర్‌ను పిలిపించింది బాయ్‌ద్వారా. అతను వచ్చి నిలుచున్నాడు ఎదురుగా.

"నేను లేనప్పుడు ఎవరైనా వచ్చారా నాకోసం'' అడిగింది.

"రాలేదండీ!'' చెప్పాడు.

"నా గదికి తాళంవేసి వెళ్ళాను. కానీ ఎవరో తెరచి గదిలో జొరబడ్డారు'' అంది కోపంగా సుసనా.

"సారీ! అలా జరిగేందుకు వీలులేదు మేడమ్. అయినా వాకబుచేసి చెప్తాను'' అంటూ వెళ్ళిపోయాడు.

ఈ పని మంజులదే అయివుండాలనిపించింది. ఆమె గుంటలుతీసిన బంటులాగుందనుకొంది. తన సామాన్లన్నీ చెక్ చేసుకొంది. అన్నీ ఉన్నాయి.

తన రహస్యాల్ని తెలుసుకొనేందుకు గదిలో ఏదైనా

యంత్రం అమర్చిందేమోనన్న అనుమానం కలిగింది. ఆ గది ఖాళీచేసి వెంటనే మరో హోటల్‌కు వెళ్ళడం మంచిదన్న నిర్ణయానికొచ్చింది సుసనా. అంతలోనే ఫ్లోర్ సూపర్‌వైజర్ వచ్చాడు.

"మీ గదిలోకి ఎవరూ వెళ్తూండడం చూడలేదంటున్నారు మా సర్వెంట్స్" అన్నాడు.

"వాళ్ళు చూడనంతమాత్రాన, నేను చెప్పింది నిజం కాకుండా పోతుందా?" అడిగింది కోపంగా.

మౌనంగా నిలుచున్నాడు.

"నేను రూం ఖాళీ చేస్తున్నాను. బిల్ పంపండి. పే చేస్తాను" అంది.

ఆమెతో అనవసరమైన చర్చకు దిగేందుకు ఇష్టంలేక "అలాగే!" అంటూ వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత అరగంటలో గది ఖాళీచేసి వెళ్ళిపోయింది సుసనా.

5

ప్రొఫెసర్ శాస్త్రి బంగళాలో జరుగుతున్న రిపేర్లు చూసి విస్తుపోయాడు. కాంపౌండ్ వాల్ పైన బార్బ్‌డ్ వైర్ బిగించడం, బిల్డింగు గోడలు పగులగొట్టడం, సెక్యూరిటీకోసం అంతకుముందునుండి ఉంటూ వచ్చిన నలుగురు సిపాయిలకు తోడు మరో నలుగురు మనుషులు క్రొత్తగా రావడం కాస్త వింతగా కనుపించింది.

ఇన్‌ఛార్జి ఆఫీసర్ను పిలిచి అడిగాడు.

అతను "నాకేం తెలీదు సార్. హెడ్‌క్వార్టర్సు ఆదేశాలను బట్టే పనులు జరుగుతున్నాయ్" అన్నాడు.

శాస్త్రికి అతని సమాధానం అంతగా తృప్తినివ్వలేదు. ఫోన్ చేశాడు మేజర్ మోహన్‌కు. అతను లైన్లోకి

రాగానే "ఏమిటి నా బంగళాలో హడావుడిగావుంది!" అడిగాడు.

"ఏం లేదు సార్! అదంతా రొటీన్ గా జరిగేదే! దాన్ని గురించి పట్టించుకోనవసరం లేదు" అన్నాడు మోహన్.

"ఉన్నట్టుండి ఇవన్నీ చెయ్యవలసిన అవసరం ఎందుకొచ్చిందో నీకు తెలీదా?"

"తెలుసు సార్. నేనే మొన్న వచ్చి చూశాను. కొన్ని సూచనలిచ్చాను. మీరు దేశానికి విలువైన విషయాల్ని గురించి పరిశోధన సాగిస్తున్నారు. ఏవిధమైన అంతరాయం లేకుండా, ఆపద రాకుండా, చూడవలసిన అవసరం నాకుంది" అన్నాడు మోహన్.

"ఆల్ రైట్! మీ వాళ్ళకు నాకోసం వచ్చే విజిటర్స్ను ఇబ్బంది పెట్టవద్దని చెప్పు. నా వ్యక్తిగత జీవితానికీ, ఆనందానికీ అడ్డురాకుండా ఉండేట్లుగా చూడటం అవసరం" అన్నాడు శాస్త్రి.

"అలాగే సార్! అందుకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే నాకు చెప్పండి. వాళ్లను అతి కఠినంగా శిక్షిస్తాను" అన్నాడు మేజర్ మోహన్.

"థాంక్స్!" అంటూ ఫోన్ కట్ చేశాడు శాస్త్రి.

మేజర్ మోహన్‌తో మాట్లాడాక కూడా, శాస్త్రి గారిక్కి ఆకస్మికంగా ఇంత బందోబస్తు ఎందుకు చేస్తున్నారో సరిగ్గా అర్థంకావటంలేదు. తన్నెవరైనా అనుమానిస్తున్నారా? తన దేశభక్తి, చిత్తవృత్తి తెలియనివాళ్ళెవరూ లేరు. అయినా ఎందుకిలా ప్రవర్తిస్తున్నట్లు? ఆలోచిస్తూ కూర్చున్నాడు.

బాయ్ వచ్చి ఉత్తరాల దొంతర టీపాయ్‌పైన పెట్టి వెళ్ళాడు.

ఒక్కొక్క ఉత్తరమే తీసుకొని చదువసాగాడు. అన్నీ మామూలే. నీలంరంగు కవరు కనుపించింది. ఫ్రమ్ అడ్రసు చదువుకొని ఉత్సాహంగా కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు. చింపి చదువబోయి, మళ్ళీ ఆ ప్రయత్నం మానుకొని, ఉత్తరంతోసహా మెట్లెక్కి పైనున్న బెడ్ రూంకి వెళ్ళి, తలుపులు మూసుకుని చదువుకున్నాడు.

ఆ ఉత్తరం సుసనా రాసింది. తను ఆదివారం రాత్రి తాజ్ ఎక్స్‌ప్రెస్‌కు వస్తున్నట్లు, వీలైతే వచ్చి స్టేషనులో కలుసుకుంటే, కొద్దిరోజులు శాస్త్రిగారి ఆతిథ్యం స్వీకరించి, తనదేశం వెళ్ళిపోదలచుకున్నట్టుగా తెలియపరచింది.

ఉత్తరంలోవున్న అక్షరాలు మాయమై, వాటి స్థానంలో సుసనా అందమైన మొహం, సుందరమైన రూపం, కనుపించసాగాయి.

అందమైన ఆమె పొందులో జీవితం విందు చేసుకోవాలన్న ఆత్రుత అధికమైంది. ఆరోజు శుక్రవారం. రాబోయే అతిథి స్త్రీ కావడంతో ఆమెకు అవసరమయ్యే వస్తువుల జాబితా తయారుచేశాడు. మిగిలిన రెండు దినాలు షాపింగు చెయ్యడంలో గడిపాడు.

ఆదివారం లాబ్‌లోకి వెళ్ళకుండానే గడిపాడు.

తొమ్మిదింటికల్లా పూలరంగడిలా తయారయి, ఇంపోర్టెడ్ ఇంపాలాలో స్టేషనుకు చేరుకున్నాడు.

తాజ్ ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది.

ఏర్ కండిషన్డ్ కంపార్టుమెంటులోంచి రెండు పెద్ద సూట్‌కేసులతో దిగింది సుసనా. ఎర్రటి పాంటు, అదే రంగు స్వెట్టరు తొడుక్కుంది. జుట్టుకు మెడమీద ఎర్ర స్కార్ఫు అందంగా బిగించి గులాబిలా ముడివేసుకొంది. పెదాలకు ఎర్రటి లిప్‌స్టిక్ రాసుకుంది.

స్వెటర్ లోంచి పైకుబుకుతున్న ఎత్తైన గుండ్రటి బొమ్మలకేసి నింపాదిగా చూడసాగాడు శాస్త్రి.

"మిస్టర్ శాస్త్రీ!" పిలిచింది సుసనా.

శాస్త్రి ఆమె ముందుకు వెళ్ళి "నిన్ను చూశాక నోట మాట రాలేదు!" అన్నాడు.

"ఏం? భయంకరంగా ఉన్నానా?" అంటూ నవ్వింది.

"కాదు! మనోహరంగా ఉన్నావు."

"మీ వెంట తీసుకెళ్తారా? లేక ఏదైన హోటల్ చూసుకోమంటారా?" అడిగింది సుసనా హాండ్ బ్యాగ్ లోంచి టికెట్ తీస్తూ.

"నీకోసం నా బంగళాలో అన్ని ఏర్పాట్లు చేశాను. ఇక్కడున్నన్ని రోజులూ నాతోనే ఉండాలి!" అన్నాడు శాస్త్రి.

"థాంక్స్!" అంది.

పోర్టరు సూట్ కేసులు అందుకుని ముందుకు నడిచాడు. అతని వెంట ఇద్దరూ నడిచారు.

ఇంపాలా కదిలింది.

"మార్వెలెస్ కారు చాలా బాగుంది" అంది సుసనా.

"నాకున్న ఆస్తి మొత్తం ఇదే!"

"మీకు అందమైన వస్తువులంటే చాలా ఇష్టంలాగుంది."

"కరెక్ట్! అందువల్లే నువ్వన్నా నాకు విపరీతమైన ఇష్టం!" అన్నాడు శాస్త్రి తన మనస్సులో ఆమెగురించి ఏర్పడ్డ అభిప్రాయాన్ని అణచుకోను సాధ్యంగాక.

ఇండియాకి వచ్చాక, తను చూచిన ప్రదేశాలు, వింతలు, వివరంగా చెప్తూ వసపిట్టలా మాట్లాడసాగింది. శాస్త్రి డ్రైవ్ చేస్తూనే ఆమె మాటలు వినసాగాడు. మొదటి

సారిగా శరీరంలోని రక్తం వేడిగా ప్రవహిస్తున్నట్లు, ఆ వేడి కళ్ళకు ప్రాకినట్లు ఫీలయినాడు.

కారు బంగళాముందుకు వచ్చింది.

పూర్తి యూనిఫాంలోవున్న జవానువచ్చి గేటు తెరచాడు. శాస్త్రి కారున్లోనికి పోనిచ్చాడు. పోర్టికోలో ఆగగానే, మరో జవాను వచ్చి తలుపు తెరచాడు. శాస్త్రి దిగాడు. తనవేపు తలుపు తెరచి పట్టుకున్నా, సుసనా అటుకేసి దిగకుండా, స్టీరింగుసీటుముందుగుండా శాస్త్రితో పాటే దిగింది కారు.

హాలులోని కదుగెట్టింది సుసనా. అక్కడ మరో ఇద్దరు జవాన్లు కనుపించారు. ఆమె గుండెల్లో బండ పడింది. కాస్త ఇబ్బందిగా మొహంపెట్టుకొని శాస్త్రి వెంట మేడమెట్లెక్కింది. బెడ్ రూంలోనికి వెళ్లారిద్దరూ.

"ఇది నా రూం! ఇందులో నువ్వుండు. ప్రక్కగది నేను సర్దుకున్నాను" అన్నాడు శాస్త్రి.

"సారీ! మీకు చాలా శ్రమ ఇస్తున్నట్లున్నాను" అంది సుసనా.

"నథింగ్! అలా అనుకోవద్దు!" అన్నాడు శాస్త్రి.

సుసనా వెళ్ళి కిటికీ తలుపులు తెరచి, వంగి చూసింది. అందమైన తోట కనుపించింది. లైటు వెలుగులో పహారా కాస్తూ వెళ్ళిన జవాను కనుపించాడు. తక్కున వెనక్కి తిరిగివచ్చి కుర్చీలో జేరబడింది.

"ఏం తీసుకుంటావ్?" అడిగాడు శాస్త్రి ఆప్యాయంగా.

"నేను రైల్లోనే భోజనం ముగించాను. మీరు మీ పనులు చూసుకోండి. కాస్త స్నానంచేసి బట్టలు మార్చుకుంటాను" అంది సుసనా.

"అలాగే! ప్రయాణంలో అలసిపోయి వుంటావ్.

విశ్రాంతి తీసుకో! ప్రొద్దున్నే కలుసుకుందాం!" అన్నాడు శాస్త్రి.

"ప్రయాణాలు చెయ్యటం నాకు అలవాటే. స్నానం చేసి వస్తాను. కూర్చోనుండండి" అంటూ బాత్ రూంకు వెళ్ళిపోయింది.

ఇరవై నిముషాల తర్వాత వెలుపలి కొచ్చింది. ఒంటి పైన సన్నటి సిల్కు నైట్ గౌన్ వేసుకుంది. లోపల ఏవిధమైన బట్టలులేవు. అంగాంగాల వొంపులు, సొంపులు, స్పష్టంగా కనుపించసాగాయి లైటు వెలుగులో.

తల తుడుచుకుంటూవచ్చి కూర్చుంది శాస్త్రి కెదురుగా.

"ఎలాగుంది నా బంగళా?" అడిగాడు శాస్త్రి గర్వంగా.

"ఇది బంగళా అనుకోలేదు!" అంది సుసనా.

"మరి...?"

"జైలనుకున్నాను."

"ఎందుకని?"

"అడుగడుగునా సిపాయిలు కనుపిస్తున్నారు. ఇక్కడ మనిషికి అవసరమైన కనీసపు శాంతికూడా ఉంటుందాని నా అనుమానం."

"నా వృత్తిరీత్యా ఈ హడావుడి తప్పటంలేదు. నాకూ ఇబ్బందిగానే వుంటుంది" అన్నాడు శాస్త్రి.

"మీకు పెళ్ళయ్యాక మీ భార్యను తీసుకొస్తే, ఆమె మొదటరోజే దండంపెట్టి విడాకులు పుచ్చుకుని వెళ్ళిపోతుంది" నవ్వుతూనే చెప్పింది.

"అవును. రేపే మాట్లాడి వీళ్ళందర్నీ పంపించివేస్తాను" అన్నాడు శాస్త్రి.

"అది జరిగిందాకా నా మనస్సుకు సంతోషంగా ఉండదు. నా ఆశలన్నీ నిరాశలయినాయి. ఎన్నో ఊహలతో వచ్చాను" అంది మత్తుగా చూస్తూ.

శాస్త్రికి ఆ చూపు తగలవలసినచోట తగిలింది. ఆమె చెప్పకుండానే తను ఇంటినుండి ఈ మందినీ, మాన్యలాన్నీ తరలించి ఉండవలసిందనిపించింది.

"సారీ! తెల్లవారగానే ఈ విషయం సెటిల్ చేస్తాను. ఈ రాత్రికి ఎలాగో నిద్రపో!" అని చెప్పి లేచి వెళ్ళిపోయాడు శాస్త్రి.

అతను వెళ్ళాక తలుపులుమూసి లైటార్పి పడుకుంది మంచంపైన.

కృష్ణసేవక్ వేసిన ప్లాను ఏ అవాంతరం లేకుండా అమలు జరపడం పెద్ద సమస్య కాదనుకుంది ముందు. తీరా వచ్చి చూశాక అది అసాధ్యమన్న అభిప్రాయం బలపడింది. శాస్త్రి చెప్పినా అతనిపై అధికారులు సిపాయిల్ని ఇంటి నుండి విరమింపజేసేందుకు ఒప్పుకొంటారో, లేదో?

అంతమంది కళ్ళుగప్పి శాస్త్రి మెదడును ట్రాన్స్ ప్లాంట్ చెయ్యడం వీలుకాదు. భారం భగవంతుడిపైన వేసి పడుకొంది.

అర్ధరాత్రి కావస్తూండగా నిద్రపట్టిందామెకు. ఆ నిద్రలోకూడా చెవులు పనిచేస్తున్నాయి. ఎవరో గదిలో పిల్లిలా మెల్లగా అడుగులువేస్తూ కదులుతున్న శబ్దమయింది. ఠక్కున లేచి వెళ్ళి లైట్ వెలిగించింది. హాలుమధ్య శాస్త్రి కనుపించాడు.

"మీరా?" అడిగింది.

"నేనే మంచినీళ్ళు తెచ్చాను" అన్నాడు గాజుకూజా చూపిస్తూ.

"తలుపులు వేశాను, లోనికెలా రాగలిగారు?"

"నా రూంకూ, దీనికి మధ్య అదిగో తలుపు వుంది" అంటూ బోల్టా తెరచి వున్న డోర్ చూపించాడు, హుషారుగా.

"బాగుంది" అంది సుసనా.

"లైటార్పుకో. వెళ్తున్నాను" అంటూ వెళ్ళిపోయాడు శా

6

పదింటికల్లా శాస్త్రి వెలుపలికి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత అరగంటకు సుసనా బయలుదేరింది. ఆ కాలనీ వెలుపలిదాకా కాలినడకన వెళ్ళింది. ఆ తర్వాత టాక్సీ ఎక్కి కన్నాట్ సర్కస్ పోనిమ్మని చెప్పింది.

ఇండియా కాఫీ హౌస్ ప్రక్కగా ఆపించింది టాక్సీ. దిగి లోనికెళ్ళి, స్పెషల్ కాఫీ టోకన్ కొనుక్కుంది. సర్వింగ్ వేపు వెళ్ళి దగ్గరున్న కూపన్ ఇచ్చి, కాఫీ కప్పు తీసుకొంది. ఖాళీగా వున్న టేబుల్‌ను వెతుక్కుంటూ వెళ్ళింది.

కూర్చుని కాఫీ సిప్ చేస్తూండగా కృష్ణసేవక్, తెల్లటి పాంటు, షర్టులో వున్న మరొక మనిషిని వెంట బెట్టుకొని వచ్చి కూర్చున్నాడు.

ఆ ఇద్దరి దగ్గరా కాఫీ కప్పు లున్నాయి.

"ఏమిటి విశేషాలు?" అడిగాడు.

తను చూసిందంతా వివరంగా చెప్పి "అని బంగళాలో లాభంలేదు. మరేదైనా ప్రదేశం చూడండి. తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాను" అంది సుసనా.

"అంత టైట్ సెక్యూరిటీ వుంటుందనుకోలేదు. ఆ ప్రయత్నం మానుకుందాం. వేరే ఏర్పాట్లు చేస్తాను. కానీ

వారం రోజులు టైం కావాలి. మళ్ళా సోమవారంనాడు ఇదే టయిమ్‌కు ఇక్కడకు రా. ప్లాను చెపుతాను" అన్నాడు కృష్ణ సేవక్.

"ఓ. కే." అంటూ ఖాళీ కప్పు ప్రక్కకు నెట్టి లేచింది సుసనా. మిగిలిన ఇద్దరూ అక్కడే కూర్చున్నారు.

సుసనా జనం మధ్యనుండి తప్పుకుని వెలుపలికొచ్చింది. రోడ్ దాటి పార్కువైపు నడుస్తుండగా, వెనుకనుండి వచ్చిన మంజుల గమనించింది. మద్రాసులోనే మధ్యలో మాయమయిపోయిన సుసనా కనుపించగానే, హుషారుగా తనూ పార్కులో జొరపడింది.

పార్కు దాటింది సుసనా.

ఆమె వెంట మంజుల కూడా దాటింది.

ఖాళీగా వెళ్తున్న టాక్సీ ఎక్కింది సుసనా.

వెనకాలే వస్తున్న ఆటో ఆపి ఎక్కింది మంజుల.

రెండూ ఒకదాని వెంట ఒకటి రోడ్లను చీల్చుకుంటూ వెళ్ళసాగాయి.

డిఫెన్సు కాలనీలోకి టాక్సీ వెళ్ళిపోగానే, ఆటోను, తనకు అవసరమైన అడ్రసు చెప్పి పోనిమ్మంది.

ఆర్మీ హెడ్ క్వార్టర్సు ముందు దిగి, ఆటోకు డబ్బిచ్చి పంపేసింది. ఇంటలిజెన్సు డిపార్టుమెంటు వేపు కారిడార్‌లో నడుస్తుండగా, ప్రొఫెసర్ శాస్త్రి, ఎదురుగా రావడం చూచి ఆశ్చర్యపోయింది.

మేజర్ మోహన్ గది తలుపులు తెరచుకొని వెళ్ళింది.

"ఆమెను చూశాను" అంది కూర్చుంటూ.

"సుసనా నేనా? ఆమె నిన్ననే వచ్చింది. ప్రొఫెసర్ గారింట్లోనే మకాం వేసింది" అన్నాడు మోహన్ తనూ కూర్చుంటూ.

"అలాగా! శాస్త్రిగారు ఇక్కడ కనుపించారా?"

"నా దగ్గర కొచ్చాడు. గంట సేపట్నుంచి ఇక్కడే వున్నాడు."

"ఎందుకు?"

"ఇంకెందుకు తన ఇంటి చుట్టూ సిపాయిలు తిరగడం బాగులేదనీ, వెంటనే విరమించమని చెప్పాడు" అన్నాడు మోహన్.

"మీరేమన్నారు?"

"ఏమన్నా వినిపించుకునే స్థితిలో లేడా ప్రొఫెసర్. ఆయనకు ఎవ్వరివల్లా ఆపదరాకుండా వుండాలనే నేను ఇన్ని ఏర్పాట్లు చేశానని చెప్పాను. ఆ సుసనా మత్తులో పడి కొట్టుకుంటున్నందువల్లనే చెప్పేది తలకెక్కలేదు. తిక్క తిక్కగా మాట్లాడాడు" అన్నాడు మోహన్.

"చివర కేమయింది?"

"ఈ సాయంత్రంలోగా సిపాయిల్ని విరమించకుంటే, తను ఉద్యోగానికి రాజీనామా గీకిపారేసి, ఇష్టమొచ్చిన దేశం వెళ్ళిపోతానని వార్నింగ్ ఇచ్చి వెళ్ళాడు."

"అరే! అయితే ఏం చేయదలచుకున్నావ్?"

"నాపై అధికారులకు చెప్పాను. వాళ్ళు రక్షణ మంత్రితో మాట్లాడి ఏం చెయ్యవలసింది చేస్తామన్నారు."

"ఆడ గాలి మహత్తు అగ్రమయిందా?"

"అఁ! అఁ! పూర్వం రాజ్యాలు పోగొట్టుకొన్న వాళ్ళూ, ప్రాణాలు తీసుకున్న వాళ్ళూ వున్నారంటే వాళ్ళ చరిత్ర చదివి నవ్వుకొన్నాను. శాస్త్రిగార్ని చూశాక, వాళ్ళే నయమనిపిస్తున్నారు" అన్నాడు మోహన్.

ఫోన్ మ్రోగింది.

మోహన్ రిసీవరు అందుకొని, అవతలి వేపునుండి విన

వస్తున్న మాటల్ని వింటూ, మధ్య మధ్య, యస్, యస్ అంటూ వుండిపోయాడు చాలాసేపు. ఆ తర్వాత ఫోన్ క్రేడిల్ చేసి "పైనుంచి ఉత్తర్వులొచ్చాయి" అన్నాడు.

"ఏమని?"

"తెగిందాకా దారం లాగడం మంచిదికాదన్నారు. వెంటనే సిపాయిల్ని విరమించమన్నారు. ఆయన రక్షణ మన ఇద్దరి నెత్తిన వేశారు" అన్నాడు మోహన్.

"మనం మాత్రం ఏంచేస్తాం?" అడిగింది మంజుల నిరుత్సాహంగా.

"ఆయనకు అనుమానం రాకుండా, వెంటాడుతూ, ఏ విధమైన అపాయం రాకుండా చూడమంటున్నారు" అన్నాడు మోహన్.

"బాగుంది. చెప్పేవాళ్ళకు చేసేవాళ్ళు లోకువన్నట్టుంది."

"మనం పనిచేసేది ఆర్మీలో. ఆజ్ఞలు తలవొంచుకొని స్వీకరించి, అమలు జరుపడం తప్ప, వాటి యుక్తాయుక్త వివేచనాలు చేయకూడదు" అంటూ లేచాడు మోహన్.

"ఎక్కడికి?"

"శాస్త్రిగారింటికి వెళ్ళి, ఆయన్ను కలుసుకొని ప్రభుత్వం నిర్ణయం తెలియజెప్పి అక్కడి మనుషుల్ని పంపేసి వస్తాను" అన్నాడు.

"నేను గూడా వస్తాను."

"వద్దు. నువ్విక్కడే వెయిట్ చేస్తూ వుండు. నేను గంటలో వస్తాను. వచ్చాక మనం ఏంచెయ్యాలో కూర్చుని ఆలోచిద్దాం!" అన్నాడు మోహన్.

"అలాగే!" అంటూ కూలబడింది మంజుల.

మోహన్ కారెక్కి శాస్త్రిగారింటివేపు రివ్వుమని

పోనిచ్చాడు. పది నిముషాలకు తక్కువ వ్యవధిలోనే జేరుకున్నాడు.

హాల్లోనే ఎదురయిన శాస్త్రిగారికి శుభవార్త చెప్పాడు.

“థాంక్ యూ మేజర్! నా క్షేమం గురించి బెంగపడకండి. నన్ను నేను రక్షించుకోగలను. నా రహస్యాలు నాలోనే వున్నంతవరకూ ఎవ్వరూ నన్ను చంపరు. అలాగా మీరు రానే వస్తారు రక్షించేందుకు” అన్నాడు శాస్త్రి.

“అలాంటిదేమీ జరగదు లెండి. ఏదో మా విధి కాబట్టి కాపలా వుంచాం” అన్నాడు మోహన్.

మళ్ళా థాంక్స్ చెప్పాడు. మోహన్ సెలవు తీసుకుని వెలుపలికొచ్చి ఒక్క సెక్యూరిటీ ఆఫీసర్ని మాత్రం వుండమన్నాడు. మిగిలిన జవానులందర్నీ వెళ్ళిపొమ్మని ఉత్తరువు ఇచ్చాడు. అంతా మూటా ముల్లె సర్దుకున్నారు.

7

బంగళాలోని కాపలా జనం నిష్క్రమించాక సుసనాకు హుషారు ఎక్కువైంది. మత్తు చూపుల్తో, మైకం కమ్మిన మాటల్తో, అంగ ప్రదర్శనంతో ప్రొఫెసర్ శాస్త్రికి పిచ్చెక్కించింది.

శాస్త్రిలో ఉద్రేకం ఎక్కువయింది. తట్టుకోలేక పోయాడు. కోరిక వెల్లడించలేక, మనసులో దాచుకోలేక కొట్టుమిట్టాడాడు.

ఆయన వాలకం కనిపెట్టి సుసనా తనే చొరవ తీసుకుని ముందంజ వేసింది. ఆ రాత్రి మొదలూ, తుదీ వాళ్ళకు తెలీదు. ఆనంద సామ్రాజ్యంలో తేలియాడారు.

నాలుగు రోజులు శాస్త్రీ, సుసనా వెలుపలకే రాలేదు. వేళకు తిండి తినడం, ప్రణయ కలాపాలాడడం తప్ప

మరో వ్యాసకం లేకుండా గడిపారు.

"నేను జీవితంలో అనుభవించింది, ఆనందించింది నీతోనే. ఇంత సుఖం నీవు అందించగలవని, అసలు ప్రణయంలో మజావుందని గానీ నాకు నిన్ను చూచిందాకా తెలీనేలేదు!" అన్నాడు శాస్త్రి.

"నేను అంతే! కాకుంటే మా దేశంలో సెక్స్ విషయాలు ఎక్కువ చదువుతాం. మిమ్మల్ను చూసింది మొదలు మీతో గడపాలన్న కోరిక కలిగింది. చివరి కెలాగయితే కోరిక కల్గింది. మన ఈ కలయిక కలకాలం జ్ఞప్తి వుంచుకుంటాను" అంది సుసనా.

"నాన్సెన్స్! మన బంధం శాశ్వతం కావాలి. నిన్ను నేను పెళ్ళాడుతాను" అన్నాడు శాస్త్రి.

"నా దేశం కాదు!"

"కాకుంటే పెళ్ళాడకూడదా?"

"మావాళ్ళను వదలి ఇక్కడ వుండేదెలా?"

"నేనే మీ దేశం వస్తాను."

"మిమ్మల్ని ప్రభుత్వం రానిస్తుందా?"

"ఇది నా వ్యక్తిగత విషయం. వాళ్ళ పర్మిషను నాకు అవసరం లేదు!"

"మీరు నన్ను పెళ్ళాడి రాగలిగితే అంతకన్నా కోరుకోనేదిలేదు. మీకా లోటు లేకుండా చూచే పూచీనాది" అంది సుసనా.

"థాంక్స్! నేను అన్ని వివరాలు కనుక్కుంటాను ఇవాళే!" అంటూ లేచాడు శాస్త్రి.

బట్టలు మార్చుకుని వెళ్ళిపోయాడు శాస్త్రి.

ఆయన వెనుకే సుసనా కూడా వెళ్ళిపోయింది.

సుసనాను అనుసరించి శాల్లో పోసాగాడు మేజర్

మోహన్. ఆ నాలుగు రోజులు మారువేషంలో శాస్త్రి బంగళా ప్రాంతాల్లో తిరిగాడు. ఎవ్వరూ వెలుపలకి రాలేదు. లోపల ఏంజరుగుతూ వుంటుందో ఊహించాడు మోహన్.

సుసనా ఇండియా కాఫీ హౌస్ వద్ద దిగి లోనికి వెళ్ళింది. మేజర్ మోహన్ కూడా ఆమెను అనుసరించి లోనికి వెళ్ళాడు.

కృష్ణసేవక్, అతని వెంట మరో వ్యక్తి వున్నారు. వాళ్ళిద్దరూ సుసనాను చూడగానే వడివడిగా ఎదురు వచ్చారు.

ముగ్గురూ కాఫీలు త్రాగి వెలుపలికొచ్చి కారెక్కారు. కారు కుడిచేతి రోడ్ వైపు సాగిపోయింది. దాన్ని అనుసరిస్తూ మేజర్ మోహన్ కారుకూడా వెళ్ళింది.

"ఏమిటి విశేషాలు?" అడిగాడు కృష్ణసేవక్.

"అతన్ని లోబరుచుకొన్నాను. నేను ఆడించనట్లల్లా ఆడుతున్నాడు శాస్త్రి. నన్ను పెళ్ళాడి నాతో మనదేశం వస్తానంటున్నాడు."

"అది జరిగేదికాదు. అతను అలాంటి అభిప్రాయంలో వున్నాడని తెలిస్తే ప్రభుత్వం అరెస్టుచేసి జైల్లో తోస్తుంది. ఏ పరిస్థితుల్లోనూ అతన్ని వదలుకోదు." అన్నాడు కృష్ణ సేవక్ వెంటవున్న వ్యక్తి.

"ఆ విషయం నాకు తెలుసు."

"ఆ గొడవ వదిలేద్దాం! మేము మరో ప్లానును తయారుచేశాం" అన్నాడు కృష్ణసేవక్.

"ఏమిటది చెప్పండి." అడిగింది సుసనా.

"బ్రెయిన్ ట్రాన్స్ప్లాంటేషన్ చేసేందుకు అవసర మైన సామగ్రి అంతా చేర్చి వుంచాం. అంతా రెండు

గంటల్లో జరిగిపోతుంది. ఆ డాక్టర్ కూడా వచ్చివున్నాడు. ఢిల్లీకి దూరంగా ఉన్న ఒక పాడుబడ్డ పాత బంగళా ఎన్నుకున్నాం మన పనికి. శాస్త్రి బ్రెయిన్ నాకూ, నా బ్రెయిన్ శాస్త్రికీ మారిపోతాయి. ఆ రాత్రికే నేను విమానంలో వెళ్ళిపోతాను. మీరు మెల్లగా ఇక్కడనుండి జారుకోండి.'' అన్నాడు కృష్ణసేవక్.

''తర్వాత!''

''ఈలోగా నువ్వు అతని లాబ్‌లో దాచుకున్న ఫైల్సు తస్కరించాలి. వాట్ని నీవెంట తీసుకురావాలి. అవిలేందే పనిజరగదు.'' అన్నాడు కృష్ణసేవక్.

''నీకు బ్రెయిన్ మారాక శాస్త్రిలాగే ప్రవర్తిస్తావను కుంటాను. నీకై నువ్వు ఈ దేశం వదలిపోను ఇష్టపడక పోవచ్చు. లేదా నీవే శాస్త్రి నంటూ గోల చెయ్యవచ్చు. అది అందరికీ తెలిస్తే మన ప్లాను చెడుతుంది. అవునా?''

''నువ్వు చెప్పింది కూడా నిజమే. అందుకే ఆపరేషన్ అయ్యాక నాకు స్పృహ రాకుండా వుంచుతారు. నన్ను సిక్ పేషంటుగా మన ఎంబెసీ వాళ్లు గుర్తించి, మనిషిని తోడిచ్చి విమానంలో పంపుతారు. నాకు మనదేశం చేరాకే స్పృహ వస్తుంది'' అన్నాడు కృష్ణసేవక్.

''మరి శాస్త్రి!''

''అతన్ని అక్కడే రెండు దినాలుంచాలి. ఆ తర్వాత వదిలెయ్యాలి.''

''దానికన్నా అతన్ని చంపితే మంచిదనుకుంటాను'' అంది సుసనా.

''వద్దు! అతని మానాన అతన్ని వదిలేద్దాం. బ్రెయిన్‌ను పాడుచేసి పెడదాం. పిచ్చివాణ్ణి చేస్తే తిరిగి తిరిగి ఛస్తాడు.'' అన్నాడు కృష్ణసేవక్.

కారు ఇంకా పోతూనే వుంది.

వెనుక వస్తున్న మోహన్ కారుకూడా అనుసరిస్తూనే వుంది.

కుతుబ్ మినార్ ముందు ఆగింది.

"మన వెనుక వస్తున్న కార్ను చూశావా?" అడిగింది సుసనా.

"ఆఁ!" అన్నాడు కృష్ణసేవక్.

"అందులో వస్తున్నది మేజర్ మోహన్. ఆర్మీ ఇంటలిజెన్స్ శాఖ మనిషి. బహుశా నన్ను వెంబడించి వచ్చి వుంటాడు." అంది సుసనా.

"ఫరవాలేదు. మనం కాసేపు చుట్టూ తిరిగి వెళ్ళిపోదాం."

"మరి నాకా బంగళా ఎప్పుడు చూపిస్తావ్."

"ఇప్పుడొద్దు. నీకు దాని గుర్తులు చెప్తాను. ఎలా రావలసిందీ ప్లాను వేసి చెపుతాను." అన్నాడు కృష్ణసేవక్.

"ఓ. కే." అంది సుసనా.

ముగ్గురూ కుతుబ్ మినార్ పైకెక్కారు. అక్కడ్నుంచి చుట్టూ కనుపించిన అందమైన దృశ్యాల్ని చూచి ఆనందించారు. అరగంటసేపు పిచ్చాపాటీ మాట్లాడుకుని దిగి క్రిందికొచ్చారు.

సిగరెట్ త్రాగుతూ కారు నానుకుని నిలుచున్న మేజర్ మోహన్‌ను చూశారు. అతని ఉనికి గమనించనట్లుగానే వెళ్ళి కారెక్కారు. కారు బయలుదేరింది. మళ్ళీ మోహన్ కారు వాళ్లను అనుసరించింది.

ఇండియా కాఫీ హౌస్ దగ్గర మళ్ళా విడిపోయారు. సుసనా ఒంటరిగా వెళ్ళిపోయింది. మోహన్ ఆమెను వదలి వాళ్ల వెంటబడ్డాడు.

8

ఇంటలిజెన్స్ శాఖ డైరక్టరు ఓబ్రాయ్ పైపు కాలుస్తూ కూర్చున్నాడు. అతనికెదురుగా మేజర్ మోహన్ కూర్చున్నాడు. అతని ప్రక్కన మంజులుంది.

"సార్! శాస్త్రిగారు మీతో తను ఫారిన్ నేషనల్ ను పెళ్ళాడదలచుకొన్నాననీ, ఆమెతో వెళ్ళిపోయేందుకు అనుమతించాలనీ, ఉద్యోగానికి రాజీనామా ఇస్తానని చెప్పాడు. అతని ఇంట్లో సుసనా అనే అమ్మాయి వుంది. ఆమె శాస్త్రితోటే హేగ్ నుంచి ఇండియాకు వచ్చింది. ఆమె దేశం మనుషులు గత వారం దినాల్లో దాదాపు ముప్పయిమందిదాకా ఇక్కడికి వచ్చారు. వీళ్లు తరచూ కలుసుకుంటూ, కార్లలో ప్రయాణం చేస్తూనే చర్చలు చేసుకుంటూ తిరుగుతున్నారు. శాస్త్రి వాళ్ళ మైకంలో పడి మన సెక్యూరిటీ పద్ధతుల్ని పీకి పారేశాడు. ఆయన పెద్ద ప్రమాదంలో వున్నట్లు నాకు అనుమానంగా వుంది" అన్నాడు మోహన్.

"ఎలాంటి ప్రమాదం?"

"వాళ్ళకు కావలసింది ఆయన రిసెర్చి చేసి కనుక్కున్న ఆటమిక్ సైన్స్ రహస్యాలు ఆయన్ను బెదరించి తెలుసుకోవచ్చు. లేదా ఆయన్ని అపహరించవచ్చు. కానీ ఈ రెండూ సాధ్యపడేవి కావు."

"ఎందుకని?"

"బెదరిస్తే రహస్యాలు చెప్పకపోవచ్చు. అందువల్ల వాళ్ళ ప్రయత్నం పదిమందికీ తెలియడం తప్ప వేరే ప్రయోజనం వుండదు. అపహరించడం అవివేకమైన చర్య. అతన్ని ఎలా మనం కాపలా కాస్తున్నదీ ఈపాటికే ఊహించే వుంటారు. మంజులను గుర్తు పట్టారు. నన్నూ

గుర్తుపట్టి వుంటారు. కాబట్టి వేరే పథకం వేసుకొని వుండాలనిపిస్తుంది బాస్!" అన్నాడు.

పైపు విదిలిస్తూ "ఆ పథకం ఏమిటని ఊహిస్తున్నావ్?" అడిగాడు ఓబ్రాయి. అతనికి మేజర్ మోహన్ శక్తి సామర్థ్యాలపైన అకుంఠిత విశ్వాసం వుంది.

"ప్రపంచ ప్రఖ్యాతి పొందిన బ్రెయిన్ ట్రాన్స్ప్లాంటేషన్ ఎక్స్పర్ట్ డాక్టర్ కోబాల్ట్ నిన్న సాయంత్రం హేగ్ నగరాన్నుండి ఇండియాకు వచ్చాడు. ఆయన రాకకు కారణం కేవలం చూచివెళ్ళడం. ఎయిర్‌పోర్టులో సుసనా ముఠావాళ్ళ మనిషి ఒకతను కలుసుకోనటం మంజుల చూసింది. ప్రస్తుతం మద్రాసు వెళ్ళాడు. ఎల్లుండి సాయంత్రం ఢిల్లీ యూనివర్సిటీలో ఆయన లెక్చరుంది. ఆ మరుసటి దినం వెళ్ళిపోతాడు" చెప్పాడు.

"దానికీ దీనికీ సంబంధం వుందా?"

"కలిపి ఆలోచిస్తుంటే అనుమానం కలుగుతూంది. అతని సాయంతో శాస్త్రి బ్రెయిన్‌ను దొంగిలించుకొని పోదామనుకుంటున్నట్లు వుంది."

ఓబ్రాయ్ సీట్లో ఎగిరిపడ్డాడు.

"ఇంపాజిబుల్!" అన్నాడు.

"ప్రపంచంలో ప్రతి క్షణం ఆధిక్యతకోసం పోరాడే ప్రభుత్వాల పద్ధతులు వింతగా వుంటాయి. ఏదీ అసాధ్యం కాదు. నేను తెలుసుకొన్నదాన్ని బట్టి, బ్రెయిన్‌లు మార్చే ఆపరేషను చేసేందుకు ఆయనకు రెండు గంటలు చాలట. శాస్త్రిగార్ని రెండు గంటలు కాదు అంతకన్నా ఎక్కువ కాలం ఇష్టమొచ్చినచోటుకి తీసుకెళ్ళగల శక్తి సుసనాకు వుంది. ఆమె వల్లో పడిపోయాడు ఆయన" అన్నాడు మోహన్.

"అయితే మనం ఏం చెయ్యాలి."

"శాస్త్రిగార్ని కాపాడాలి?"

"ఎలా చేద్దాం? ఆయన్ను అరెస్టు చేద్దాము?"

"అది తాత్కాలికంగా వాళ్ళను ప్రయత్న విముఖుల్ని చేస్తుంది. మరోమారు మళ్ళీ ఇంకా పకడ్బందీగా ప్రయత్నం చేస్తారు. వాళ్ళ ఆట కట్టించాలి. వాళ్ళ చేతులు వాళ్ళ కన్నే పొడవాలి!" అన్నాడు మోహన్ సీరియస్‌గా.

"నీ మీద నాకు నమ్మకం వుంది. నువ్వేం చేద్దామన్నా సరే. అవసరమయిన అన్ని అధికారాలు ఇస్తాను. ఏర్పాట్లు చేస్తాను. శాస్త్రిని మనం కాపాడాలి. కాదు శాస్త్రి బ్రెయిన్‌ను కాపాడాలి!" అన్నాడు ఓబ్రాయ్.

"ఈ విషయం పైవాళ్ళకు కూడా తెలుపడం మంచిది. నేను పథకం ఆలోచిస్తాను. ఈలోగా వాళ్ళు ఆపరేషను కండక్టు చేసేందుకు ఏర్పాట్లు ఎక్కడ చేసుకుందీ తెలుసుకుంటాను" అన్నాడు మోహన్ లేస్తూ.

"అలాగే! నేను ఇప్పుడే వెళ్ళి విషయాలు వివరించి చెపుతాను మంత్రిగారికి" అంటూ లేచాడు ఓబ్రాయ్.

మోహన్, మంజుల వెలుపలికొచ్చారు. కారెక్కారు. కారు తిన్నగా మెడికల్ వింగ్ వేపు వెళ్ళింది. కారాపి దిగి లోనికి వెళ్ళారు.

అరగంటసేపు సర్జన్ జనరల్ అరోరాతో మాట్లాడాడు మోహన్. శాస్త్రిగారి ఫొటో చూపించాడు.

"అదంత కష్టమైన పని కాదు. ఆయన ఎత్తూ, లావు వున్న మనిషిని తీసుకు రండి. ప్లాస్టిక్ సర్జరీతో అతన్ని ఫొటోలో వున్న శాస్త్రిలా తయారు చెయ్యగలను. కానీ ఒక్కరోజు టైం కావాలి" అన్నాడు అరోరా.

"మీకు రేపుదయం మనిషిని అప్పగిస్తాను. రేపు రాత్రికి

అతన్ని నాకు తిరిగి అప్పగించండి" అన్నాడు మోహన్.

"అలాగే!" అన్నాడు అరోరా.

అక్కడ్నుంచి వెలుపలికొచ్చాడు.

"మంజులా! నువ్వు మారువేషంలో వెళ్ళాలి. ఆ కృష్ణ సేవక్ ను వెంటాడు. ఆపరేషన్ కు అవసరమైన సామగ్రి కొంటారు. దాన్ని వాళ్ళు తాము ఏర్పాటు చేసుకున్న ప్రదేశానికి చేర్చే ప్రయత్నం చేస్తారు. నువ్వు ఎలాగైనా ఆ ప్రదేశాన్ని కనుక్కోవాలి. అది చాలా ఇంపార్టెంటు" అన్నాడు మోహన్.

"అలాగే బాస్!" అంది మంజుల.

"నాకు వేరే పనులున్నాయి. అవన్నీ చూస్తాను." అన్నాడు మోహన్.

ఇద్దరూ అక్కడే విడిపోయారు.

9

రాత్రి ఒంటిగంటయింది.

ఆటవిడుపులో హాయిగా గుర్రుపెట్టి నిద్ర పోతున్నాడు శాస్త్రి. ప్రక్కనే పడుకున్న సుసనా మెల్లిగా లేచి కూర్చుంది. శాస్త్రిని చేత్తో కదలించి చూసింది. అతనికి మెలకువ రాలేదు. తను పాలల్లో కలిపి ఇచ్చిన మత్తుమందు పనిచేసినందుకు సంతోషంగా నవ్వుకుంటూ లేచింది.

మెల్లగా మెట్లు దిగి క్రిందకు వచ్చింది.

సెక్యూరిటీ జనాల్ని ఎవ్వరూ రాత్రిళ్లు బంగాళాలోపల వుండడం లేదు. నేల మాళిగలోవున్న లాబొరేటరీకి పోయే తలుపు తెరుచుకొని మెట్లు దిగి క్రిందికి దిగింది. లైటు వెలిగించింది. చాలా విశాలంగా వుంది. రకరకాల మెషిన్లు, సీసాలు కనుపించాయి.

పైనుంచి తెచ్చిన తాళాల సాయంతో బీరువాలన్నీ

తెరచి వెతికింది. తనకు కావలసిన ఫైలు కనుపించలేదు. మళ్ళీ నిదానంగా వెతికింది. ఎనిమిది మిల్లీమీటర్ల ఫిలిం కాన్ కనుపించింది. దాని పైనున్న లేబిల్ కేసి చూసింది. దానిమీద రాసివున్న వివరాల్ని చదివి ఆనందంతో గెంతు లేసింది.

శాస్త్రిగారి పరిశోధనా ఫలితంగా కనిపెట్టిన ఫార్ములు ఫిలిం తీసివుంచారు. పైమూత తెరచి, ఫిలింలో చూసింది. పాజిటివ్ ఫిలిమ్ అది. దాని నెగటివ్ మరేదో లాబ్ లో దాచివుంటారనుకుంది. అయినా నెగటివ్ తో తనకు పనిలేదు. బీరువాలన్నీ యథాప్రకారం మూసేసి తాళాలువేసి, పైకొచ్చింది.

శాస్త్రి గుర్రుపెట్టి నిద్రపోతునే వున్నాడు.

ఫిలిమ్ కాన్ తీసుకొని వెలుపలకొచ్చింది. బంగాళా వెనుక వేపుకు వెళ్ళి కొబ్బరిచెట్టు మొదట్లో నేలను త్రవ్వింది చేతులతోనే. అందులో దాన్ని పెట్టి పైన మట్టి కప్పింది. గబగబ బంగాళాలోకి వచ్చింది.

చేతులు వాష్ బేసిన్ లో కడుక్కుంది.

వచ్చి యథాప్రకారం పడుకుంది.

తెల్లవారింది.

శాస్త్రి కాఫీ త్రాగుతూండగా ఫోన్ మ్రోగింది. రిసీవరు పైకెత్తి మాట్లాడి వచ్చి కూర్చున్నాడు.

"ఎవరండీ ప్రొద్దున్నే!" అడిగింది సుసనా.

"రక్షణ మంత్రిగారితో చిన్న సమావేశం వుందట. పదిగంటలకల్లా రమ్మని ఆయన పి. ఏ. ఫోన్ చేశాడు" అన్నాడు శాస్త్రి.

"మళ్ళీ రావడం ఎప్పుడు?"

"గంటలో వచ్చేస్తాను."

"ఇవాళ సాయంత్రం వేరే ప్రోగ్రాం పెట్టుకోకండి. మా దేశంనుండి వచ్చిన ఫ్రెండ్స్ కొందరు చిన్న పార్టీ చేసుకుంటున్నారు. నన్ను రమ్మన్నారు. మీరు వెంట లేకుండా రావడం కుదరదన్నాను. మిమ్మల్నికూడా పిలుచుకు రమ్మన్నారు" అంది సుసనా.

"స్వీట్ గరల్!" అంటూ బుగ్గ గిల్లాడు.

సుసనా సిగ్గు వొలకబోసింది.

ఆ తర్వాత శాస్త్రి డ్రెస్ చేసుకొని వెళ్ళిపోయాడు.

సుసనాకు ఆనందంగా వుంది. తన దేశం తనకు అప్పగించిన కార్యాన్ని నిర్విఘ్నంగా నిర్వహించ గలుగుతున్నందుకు గర్వం కలిగింది. ఆ సాయంత్రం శాస్త్రిని తీసుకెళ్లి అప్పగిస్తే తన పని పూర్తవుతుంది.

శాస్త్రి పన్నెండు గంటలకల్లా వచ్చాడు.

రాగానే పైకి రాకుండా క్రిందే కూర్చున్నాడు. సుసనా గమనించి క్రిందికొచ్చి "ఏమయింది?" అడిగింది.

"ఏంది?" అన్నాడు.

"అదే మీరు వెళ్ళిన కాన్ఫరెన్సు."

"అదా! అయిపోయింది" అన్నాడు శాస్త్రి. అతని గొంతు కాస్త జీరగా పలికింది. అది గమనించింది సుసనా.

"ఏమిటి గొంతు అలాగుంది?"

"అక్కడ ఐస్ క్రీమ్ తిన్నాను. జలుబు చేసింది వెంటనే" అన్నాడు శాస్త్రి.

"సాయంత్రం వేరే ప్రోగ్రాం ఏమీ పెట్టుకోలేదు కదా?"

"లేదు!"

తల నొప్పిగా వుందంటూ లేచివెళ్ళి పడుకున్నాడు.

సుసనా తన పనుల్లో మునిగిపోయింది. తన ఉనికిని

తెలిపే వస్తువుల్ని మొత్తం తీసేసి సూట్ కేసుల్లో సర్దింది. బయలుదేరి వెళ్ళబోయే ముందు వాటిని పెరట్లో వున్న బావిలో పారెయ్యాలని తీర్మానించుకొంది.

శాస్త్రి మూడింటికి లేచాడు. బాత్ రూంకు వెళ్ళాడు. ముహం కడుక్కున్నాడు.

పాంటుకున్న వాచ్ పాకెట్ తడుముకున్నాడు. చిన్న సెలి ట్రాన్స్మిటర్ గట్టిగా తగిలింది. దాని సాయంతో తనకూ, మేజర్ మోహన్ కూ మధ్య లింకు ఏర్పడి వుంది. తనెక్కడుందీ, ఏం చేస్తుందీ ప్రతి క్షణం తెలుస్తూనే వుంటాయి.

10

ఆరు గంటలయింది.

శాస్త్రీ, సుసనా తయారయినారు.

క్రిందికి దిగి కారెక్కారు.

కారు ఎటు పోవాల్సిందీ చెప్పసాగింది సుసనా. శాస్త్రి డ్రైవ్ చేస్తున్నాడు. ఢిల్లీ నగరం దాటింది. ఫరీదాబాదు నుండి చీలి రోడ్ ను అంటిపెట్టుకుని పోసాగింది. దానికి నాలుగు ఫర్లాంగుల దూరంలో మేజర్ మోహన్ పెద్ద కార్లో అనుసరించి పోసాగాడు; అతనితోపాటు ఆరుగురున్నారు. అందరిదగ్గరా ఆయుధాలున్నాయి.

పాడుబడ్డ పాత బంగళాముం దాగింది శాస్త్రి కారు. అక్కడ అంతకుముందే రెండుమూడు కార్లు పార్కు చేసివున్నాయి.

"పార్టీ ఇంతదూరంలో పెట్టుకొన్నారేం?" అడిగాడు శాస్త్రి.

"కాస్త ప్రశాంతంగా వుంటుందని..." అంటూ లోనికి నడచింది.

లోపల మొత్తం పదిమంది వున్నారు.

శాస్త్రి అడుగుపెట్టగానే నలుగురు అతనిపైన బడి పెడరెక్కలు విరిచి పట్టుకొన్నారు.

"ఏమిటిది?" అడిగాడు కోపంగా.

"ఏమీలేదు. నీ మెదడు చాల గొప్పదని తెలిసింది. దాంతో మాకు అవసరం వుంది. దాన్ని తీసుకెళ్ళేందుకు వచ్చాం." అన్నాడు కృష్ణసేవక్.

"సుసనా?" అరచాడు శాస్త్రి.

"ఇందుకోసమే నేను నీకు నా శరీరం అప్పగించింది." అంది సుసనా తాపీగా.

"రాక్షసీ! నన్ను ప్రేమించావనుకున్నాను."

"నా దేశాన్ని తప్ప మరి దేన్నీ ప్రేమించడం నేను ఇంకా నేర్చుకోలేదు."

"ఇది అన్యాయం."

"మాకు న్యాయంగానే తోస్తూంది" అంటూ మిగిలిన వాళ్ళవైపు తిరిగి "కానివ్వండి ఆపరేషను థియేటరుకు చేర్చండతన్ని!" అరచాడు కృష్ణసేవక్.

మేజర్ మోహన్ గుమ్మంలో ప్రత్యక్షమైనాడు. పకపక నవ్వాడు.

"నువ్వా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నేనే! ఏం విచిత్రంగా వుందా? తెలివి మీ సొత్తు మాత్రమే కాదు" అన్నాడు చేతిలోవున్న మెషిన్‌గన్ పైకెత్తి.

"మా పనికి నువ్వు అడ్డం రాలేవు. నిన్నుకూడా చంపేస్తాం."

"చంపండి. కానీ నన్ను చంపబోయే ముందు ఒక విషయం మాత్రం చెప్పనివ్వండి. అది తెలుసుకోవడం

మీ కే మంచిది.''

''ఏమిటా విషయం?'' అడిగింది సుసనా.

''అతని మెదడులో మట్టి తప్ప మరేం లేదు. మా ఆఫీ సులో తుపాకీలు తుడిచే మామూలు సిపాయి అతను. మీరు అనుకొనే ప్రొఫెసర్ శాస్త్రి కాదు. శాస్త్రి గార్ని పదిగంటలకే మేము ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌లో నాచి వేశాం'' అన్నాడు.

అందరూ అవాక్కయి నిలుచున్నారు.

''అతని మాటలు నమ్మవద్దు. మనల్ని బోల్తా కొట్టిం చేందుకు అబద్ధం చెపుతున్నాడు. ఇతనితో పదిరాత్రులు గడిపాను నేను. అతనే శాస్త్రి. పని కానివ్వండి'' అంది సుసనా.

''అన్ని రాత్రులు గడిపినా అతన్ని ఎలా గుర్తు పట్ట లేకపోయావో నాకు అర్ధం కావడంలేదు. ఆయనకన్నా ఉద్రేకం నీకే ఎక్కువగా వున్నట్లుంది. అందువల్లే అతన్ని గుర్తు పట్టలేకపోయి వుంటావ్. బ్రెయిన్‌లు మార్చే సర్జను, అతనికి ప్లాస్టిక్ సర్జరీ చేసి శాస్త్రిలా తయారు చేసి వుండవచ్చని ఎందు కూహించలేక పోయారో విచి త్రంగా వుంది'' అన్నాడు మోహన్.

వెనుకనుండి మంజుల మరో ఇరువురు మిలిటరీ ఆఫీసర్లు ఆయుధాలతో లోనికి కొచ్చారు. వాళ్ల మధ్యనున్న శాస్త్రిని చూసింది సుసనా.

''అనుగో శాస్త్రీ!'' అరచింది సుసనా.

''నేనే శాస్త్రిని. మావాళ్ళు ముదట్నుంచి హెచ్చ రిస్తూనే వుండిపోయారు. కానీ నేనే ఆమె మత్తులో పడి నమ్మలేదు. ఇప్పుడు నమ్మక తప్పటం లేదు'' అన్నాడు శాస్త్రి.

"మర్యాదగా మీరంతా లొంగిపోండి. ఈ యింటికి రాత్రి టైం బాంబ్ పెట్టించాను. నాకు లొంగి, నాతో రాకుంటే తిన్నగా స్వర్గానికి పోతారు" అన్నాడు మోహన్.

కృష్ణసేవక్ ఆలోచనలో పడ్డాడు. తమ దగ్గర రివాల్వర్లున్నాయి. కానీ ఎదురుగా వున్న వాళ్ళదగ్గర మెషిన్ గన్స్ కనుపిస్తున్నాయి. వాటితో ఎక్కువసేపు పోరాడటం కష్టం.

అందరూ ఆయుధాలు పారేశారు.

మేజర్ మోహన్ గుంపునంతా బంధించాడు.

కార్లలో కెక్కించి ఆర్మీ హెడ్ క్వార్టర్సుకు పంపాడు.
మేజర్ మోహన్, మంజుల కారెక్కారు.

"ఈ స్థలం కనుక్కోవడంలో నువ్వు చాల శ్రమపడ్డావ్. నీ వల్లే ఈ గొడవ ఏ విధమైన రక్తపాతం లేకుండా సమసిపోయింది" అన్నాడు మోహన్.

"ఆ కృష్ణసేవక్ ఆక్సిజన్ సిలెండరు కొన్నాడు. నేను మగవాడి వేషం వేసుకొని అక్కడే తారట్లాడుతూ నిలుచున్నాను. దాన్ని డిక్కీలో ఎక్కించగానే అతను వెళ్ళి కారెక్కాడు. నేను గుట్టుగా డిక్కీలో కెక్కాను. ఆ స్థలం అలా తెలుసుకోగలిగాను" అంది మంజుల.

కారు ఆర్మీ హెడ్ క్వార్టర్సు చేరుకుంది.

ఓబ్రాయ్ లేచి ఎదురొచ్చి "వెల్ డన్ మై బాయ్!" అంటూ మేజర్ మోహన్ను కౌగలించుకున్నాడు. ఆయన కళ్లలోనుంచి ఆనందాశ్రువులు రాలాయి.

—: ఐపోయింది :—